RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

PUBLISHED FROM : HYDERABAD | సంపుటి : 11 సంచిక : 89 బుధవారం 12 - 11 - 2025 ఎడిటర్ : బొమ్మరబోయున వెంకన్న ముదిరాజ్ అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ పేజీలు : 08 వెల : 2 రూ

# ముగిసిన జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పోలింగ్

- 14న ఓట్ల లెక్కింపు ప్రక్రియ
- జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు ముగిసిన పోలింగ్ సమయం
- జూబ్లీహిల్స్‌లో సాయంత్రం 5 వరకు 47.16 శాతం పోలింగ్
- సాయంత్రం 6లోపు క్యూలైన్లలో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం
- ముగ్గురు ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు 58 మంది ఈ ఉపఎన్నిక బరిలో నిలిచారు
- ఈ నెల 14న వీరి భవితవ్యం బహిర్గతం కానుంది




జూబ్లీహిల్స్‌లో ఉపఎన్నిక పోలింగ్ ముగిసింది. సాయంత్రం 5 వరకు 47.16 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. సాయంత్రం 6 గంటల లోపు క్యూలైన్లలో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఈనెల 14న ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనుంది. జూబ్లీహిల్స్ బైపోల్ ప్రచారం నెల రోజులుగా హోరాహోరీగా సాగింది. ముగ్గురు ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు 58 మంది ఈ ఉపఎన్నిక బరిలో నిలిచారు. జూబ్లీ నియోజకవర్గ పరిధిలో 4 లక్షలకు పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.ఓటు హక్కును వినియోగించుకునేందుకు 139 ప్రాంతాల్లో 407 పోలింగ్ - మిగతా 2 లో

# అందెశ్రీ పాడెను మోసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి




- ఘట్‌కేసర్‌లో ముగిసిన అందెశ్రీ అంత్యక్రియలు
- అంతిమ సంస్కారాలకు రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరు
- అందెశ్రీ లేకపోవడం తీరని లోటు అన్న ముఖ్యమంత్రి

# పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలపై కేసు నమోదు




- ఎన్నికల ప్రవర్తనా నియామావళిని ఉల్లంఘించిన వారిపై కేసు నమోదు చేసిన పోలీసులు
- బీర్ల ఐలయ్య, రామచంద్రనాయక్, రాందాస్‌లపై మధురానగర్ స్టేషన్లో రెండు కేసులు
- మాజీ ఎమ్మెల్యేలు వినయ్ భాస్కర్, మెతుకు ఆనంద్‌పై బోరబండలో కేసు నమోదు

# ఎర్రకోట పేలుళ్ల సూత్రధారులను వదిలిపెట్టం

- భూటాన్ నుంచి మోదీ హెచ్చరిక
- ఢిల్లీ ఎర్రకోట సమీపంలో కారులో భారీ పేలుడు
- భూటాన్ పర్యటన నుంచే తీవ్రంగా స్పందించిన ప్రధాని
- బాధిత కుటుంబాలకు యావత్ దేశం అండగా ఉంటుందని భరోసా
- నిందితులను ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదు
- దిల్లీ పేలుడుపై స్పందించిన ప్రధాని మోదీ
- దిల్లీ ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు ఘటనలో మృతుల సంఖ్య 12కు పెరిగింది
- పేలుడు నేపథ్యంలో ఎర్రకోట మెట్రో స్టేషన్‌ను మూసివేత



ఢిల్లీలోని చారిత్రక ఎర్రకోట సమీపంలో జరిగిన కారు పేలుడు ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా స్పందించారు. ఈ దారుణానికి పాల్పడిన కుట్రదారులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని ఆయన హెచ్చరించారు. నిన్న సాయంత్రం జరిగిన ఈ ఘటనలో 9 మంది మరణించగా, 20 మంది గాయపడిన విషయం తెలిసిందే. ప్రస్తుతం రెండు రోజుల పర్యటన నిమిత్తం భూటాన్‌లో ఉన్న ప్రధాని మోదీ... థింపూలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. “ఈ పేలుళ్ల వెనుక ఉన్న కుట్రను మన దర్యాప్తు సంస్థలు ఛేదిస్తాయి. సూత్రధారులను వదిలిపెట్టే ప్రసక్తే లేదు. బాధ్యులైన ప్రతి ఒక్కరినీ న్యాయస్థానం ముందు నిలబెడతాం” అని మోదీ స్పష్టం చేశారు.ఢిల్లీ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని, ఎంతో భారమైన హృదయంతో ఇక్కడికి వచ్చానని ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు. “నిన్న సాయంత్రం జరిగిన ఈ భయానక ఘటన అందరినీ విషాదంలోకి నెట్టింది. బాధిత కుటుంబాల దుఃఖాన్ని నేను అర్థం చేసుకోగలను. ఈ కష్ట సమయంలో యావత్ దేశం వారికి అండగా నిలుస్తుంది” అని ఆయన భరోసా ఇచ్చారు. ఈ - మిగతా 2 లో

# మా అమ్మాయి ఉగ్రవాదా?... నమ్మలేకపోతున్నాను!

- డాక్టర్ షాహీన్ తండ్రి ఆవేదన
- ఢిల్లీ సమీపంలోని ఫరీదాబాద్‌లో భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం
- కేసుతో సంబంధం ఉన్న లక్నోకు చెందిన మహిళా డాక్టర్ షాహీన్ అరెస్ట్
- నా కూతురు ఇలాంటి పనులు చేస్తుందని ఊహించలేదన్న తండ్రి సయ్యద్ అహ్మద్
- మరో డాక్టర్ ముజమ్మిల్ ఇచ్చిన సమాచారంతో షాహీన్‌ను పట్టుకున్న పోలీసులు
- షాహీన్ కారులో ఏకే-47 రైఫిల్ స్వాధీనం చేసుకున్న అధికారులు




ఢిల్లీ సమీపంలోని ఫరీదాబాద్‌లో భారీగా పేలుడు పదార్థాలు పట్టుబడిన కేసులో లక్నోకు చెందిన మహిళా డాక్టర్ షాహీన్‌ను పోలీసులు అరెస్ట్ చేయడం సంచలనం సృష్టిస్తోంది. - మిగతా 2 లో

# విదేశీ విద్యార్థులు రావడం అమెరికాలోని వ్యాపారాలకు మంచిది

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్
- అమెరికాలో చదువుకోవడానికి ఎలాంటి అడ్డంకులు లేవన్న ట్రంప్
- ఇది దేశ ఉన్నత విద్యావ్యవస్థకు మద్దతుగా ఉంటుందన్న ట్రంప్
- విదేశీ విద్యార్థులను సగానికి తగ్గిస్తే వ్యవస్థ దెబ్బతింటుందని ఆందోళన



విదేశీ విద్యార్థులు అమెరికాలో విద్యనభ్యసించడానికి రావడం తమ దేశంలోని వ్యాపారాలకు మేలు చేస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఇతర దేశాల విద్యార్థులు అమెరికాలో - మిగతా 2 లో

# ఏపీలో పారిశ్రామిక పండుగ



- 50 ఎంఎస్‌ఎంఈ పార్కులను ప్రారంభించిన చంద్రబాబు
- కనిగిరిలో ఎంఎస్‌ఎంఈ పార్కును ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- రాష్ట్రవ్యాప్తంగా 50 పార్కులకు వర్చువల్‌గా శ్రీకారం
- రూ.25,256 కోట్ల పెట్టుబడులతో 25 పరిశ్రమల ప్రారంభోత్సవం
- పారిశ్రామికవేత్తలకు అన్ని వసతులు కల్పిస్తామన్న సీఎం
- చెత్త నుంచి సంపద సృష్టించడం కొత్త విధానమని వెల్లడి
- గత పాలనలో పారిశ్రామికవేత్తలు పారిపోయారని విమర్శ

ఏపీలో పారిశ్రామిక ప్రగతికి ఊతమిస్తూ సీఎం చంద్రబాబు భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రకాశం జిల్లా కనిగిరిలోని పెదఈర్లపాడులో ఏర్పాటు చేసిన ఎంఎస్‌ఎంఈ పార్కును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 17 జిల్లాల్లో ఏర్పాటు చేస్తున్న - మిగతా 2 లో

# ఏపీకి మరో భారీ పెట్టుబడి




- నాయుడుపేటలో దేశంలోనే అతి పెద్ద పీసీబీ తయారీ యూనిట్
- నాయుడుపేటలో సిర్మా ఎస్‌జీఎస్ ప్లాంట్
- రూ.1,595 కోట్ల పెట్టుబడితో పీసీబీ తయారీ యూనిట్
- సుమారు 2,170 మంది యువతకు నైపుణ్యంతో కూడిన ఉపాధి
- తమ ప్రభుత్వ ‘స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్’ వల్లే సాధ్యమైందన్న లోకేశ్
- ఏపీ వేగాన్ని చూసే ఇక్కడికి వచ్చామన్న కంపెనీ ఎండీ జేఎస్ గుజ్రాల్

# ఆలోచనతో రండి పారిశ్రామికవేత్తలు కండి

- సీఎం చంద్రబాబు పిలుపు
- పెట్టుబడులకు ఏపీ స్వర్గధామం
- కనిగిరిలో ఎంఎస్‌ఎంఈ పార్కును ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- సీఐఐ సదస్సులో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులే టార్గెట్
- గత పాలనలో పరిశ్రమలు రాష్ట్రం విడిచి పారిపోయాయన్న సీఎం
- 2026 నాటికి వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తామని హామీ
- రాష్ట్రంలో సంపద సృష్టించి, అందులో ప్రజలందరినీ భాగస్వాములను చేస్తామని చంద్రబాబు పునరుద్ఘాటించారు
- వెనుకబడిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి పరిశ్రమలు, సాగునీరు అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ



యువత మంచి ఆలోచనలతో ముందుకు వస్తే, వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే బాధ్యత తమదని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి 175 నియోజకవర్గాల్లో ‘ప్లగ్ అండ్ ప్లే’ విధానంలో పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేసి, లక్షలాది ఉద్యోగాలు సృష్టిస్తామని ఆయన ప్రకటించారు. ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గం పెదఈర్లపాడులో ఏర్పాటు చేసిన ఎంఎస్‌ఎంఈ పార్కును మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మరో 17 జిల్లాల్లో రూ.873 కోట్ల వ్యయంతో 868 ఎకరాల్లో అభివృద్ధి చేసిన 49 ఎంఎస్‌ఎంఈ పార్కులకు వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. వీటితో పాటు రూ.25,256 కోట్ల - మిగతా 2 లో

# సంపాదకీయం

## బాలోత్సవం





కథ పుట్టడమూ, పిల్లల కథ పుట్టడమూ వేరుగా జరిగివుండదు. పిల్లల కంటే బాగా 'ఊ'కొట్టగలిగేవారెవరు! పిల్లలను మైమరి పించ డానికే పెద్దలు కథలు అల్లివుంటారు. ఆ వంకతో తమ చిన్నత నంలోకీ జారుకు నివుంటారు! చిన్నతనానికీ పెద్దరికానికీ ఉన్న స్పష్టమైన తేడా: బాల్య ంలో ఊహలకు సంకెళ్లుండవు. తార్కిక పరిమితి కలలను అణిచి వేయదు. ఎంత సాగితే అంత, ఎంత చూస్తే అంత, ఎంత కావాలనుకుంటే అంత. అక్కడ ఆశలు అనంతం. రెక్కలు అమాంతం. కప్పలు పకపకా నవ్వొచ్చు. కుందేళ్లు చకచకా మాట్లాడొచ్చు. కాకులు నీతులు చెప్పొచ్చు. జింకలు కోతలు కోయొచ్చు.పిల్లల కథ అనేది మబ్బుల్లోకి గెంతించే మాయా కిటికీ. సముద్రం అడుగుకు ఈదనిచ్చే గాలి పడవ. ప్రతి తరమూ తర్వాతి తరానికి అవసరమయ్యే వివేకపు రాశిని కథల రూపంలోనే బదిలీ చేస్తుంది. లోకాన్ని ఎదుర్కోవడానికి అవసరమయ్యే కాఠిన్యాన్ని అందులోనే కూరి ఉంచుతుంది.ఈసప్ కథలు, పంచతంత్రం కథలు, వెయ్యిన్నొక్క రాత్రుల అరేబియన్ కథలు, జంగిల్ బుక్, కాంచన ద్వీపం, గలివర్ సాహసయాత్రలు, 'చందమామ' కథల నుంచిబీ టామ్ శాయర్, నొప్పి డాక్టర్, లిటిల్ ప్రిన్స్, హాబిట్, హారీ పాటర్ దాకా పిల్లల మనో ప్రపంచపు ఎల్లలను విశాలపరిచినవే! కథల వల్ల పిల్లలకు ఊహాశక్తి పెరుగుతుంది, సమస్యా పరిష్కారం తెలుస్తుంది, భాష అబ్బుతుంది, వ్యక్తీకరణ అలవడుతుంది, లోకరీతి అర్థమవుతుంది, ప్రపంచపు భిన్నత్వం పట్ల అవగాహన కలుగుతుంది, సాటి జీవుల పట్ల సానుభూతి కలుగుతుంది, తమ సాంస్కృతిక వారసత్వపు గొప్పతనం అనుభవంలోకి వస్తుంది, అన్నింటికీ మించి అమితమైన ఆనందం దొరుకుతుంది. జీవితపు సంరంభంలోంచి వచ్చే ఆనందానికి అదనంగా, మనిషికి ఉన్న మరో ఆనందపు వనరు కథలు కాక మరేమిటి?అసలు పిల్లల కథలు పిల్లలకు కలిగించే ప్రయోజనాలన్నీ పెద్దలకు కూడా కలిగిస్తాయి. ఏం పెద్దల్లో మాత్రం పిల్లలు బజ్జునిలేరా? అంతెందుకు, అరిస్టాటిల్ లాంటి తత్వవేత్త కూడా నిజమైన మంచి జీవితం గడపడం కోసం కాల్పనికత అవసరాన్ని సమర్థించాడు. అసలు సాధ్యం కానిది కూడా ఊహించగలగడం అవసరమని ఆయన వాదించాడు. టాల్‌స్టాయ్ లాంటి మహారచయిత కూడా పిల్లల కోసం కథలు రాశాడు.కాకపోతే ఇదీ నీతి అంటూ ప్రత్యేకంగా చెప్పకూడదనీ, కథ ద్వారా పిల్లలు తమకు కావాల్సింది తాము తీసుకుంటారనీ అన్నాడు. మీరు ఎంతపెద్దవాళ్లయినా బాలసాహిత్యాన్ని చదవాలంటుంది కాథెరీన్ రండెల్ అనే బాలసాహిత్య రచయిత్రి. పిల్లల పుస్తకాలు మనం మర్చిపోయిన విషయాలనే కాదు, మనం మర్చిపోయామని మర్చిపోయిన విషయాలను కూడా గుర్తుచేస్తాయం టుందామె. లండన్‌లోని థేమ్స్ నదిలో పడవ షికారుకు పోయినప్పుడు తన వెంటున్న స్నేహితుడి ముగ్గురు కూతుళ్లకు ఓ కథ చెప్పాడట లూయిస్ కరోల్. అందులో అలీస్ లిడ్డెల్ అనే పదేళ్ల పాప కూడా ఉంది. ఒక రోజు నది ఒడ్డున విసుగ్గా కూర్చున్న 'అలీస్'కు కోటు తొడుక్కుని, గడియారం పెట్టుకున్న ఒక తెల్ల కుందేలు కనబడటమూ, దానివెంట ఆమె ఆ కుందేలు బొరియలోకి పోవడమూ, అక్కడ్నుంచి వింతలూ విచిత్రాలూ... వాహ్! విన్నవెంటనే దాన్ని తనకోసం రాసిపెట్టమందట అలీస్. అట్లా 'అలీస్(స్) అడ్వెంచర్స్ ఇన్ వండర్‌లాండ్' పుస్తకంగా రూపుదాల్చింది.1865 నవంబర్‌లో తొలిసారి ప్రచురితమైన దీనికి ఈ నెలలోనే 160 ఏళ్లు వచ్చాయి. జంతువులు జంతువుల్లా ఉండకుండా, మనుషులు మనుషుల్లా కాకుండా ప్రవర్తించే సాహిత్యాన్ని 'నాన్సెన్స్ లిటరేచర్' అని వర్గీకరించడం ఉంది. దాన్ని నిరర్థకమైనదని కాకుండా, హేతువుకు అందని అర్థవంతమైన సాహిత్యం అన్న అర్థంలో చూడాలి. అందుకేనేమో, ఇకనుంచీ బాల సాహిత్యానికీ తమ అవార్డు ఇవ్వనున్నట్టు బుకర్ ఫౌండేషన్ ఇటీవలే ప్రకటించింది. 8%-%12 ఏళ్ల చిన్నారులను ఉద్దేశించి రాసే ఉత్తమ రచనకు 'చిల్డ్రెన్స్ బుకర్ ప్రైజ్' పేరుతో యాభై వేల పౌండ్లు ఇవ్వనున్నారు. బాలసాహిత్యం అనేది తీసేయదగినది కాదనీ, బాలసాహితీ వేత్తలు తక్కువ రచయితలేమీ కారనీ చెప్పే ఘనమైన వార్త ఇది. కాదామరి... నేటి బాలలే రేపటి ప్రపంచ నిర్మాతలు.

## ఎర్రకోట పేలుళ్ల సూత్రధారులను వదిలిపెట్టం

**మొదటిపేజీ తరువాయి** – ఘటనపై దర్యాప్తు చేస్తున్న అన్ని ఏజెన్సీలతో తాను రాత్రంతా టచ్‌లోనే ఉన్నానని ప్రధాని వెల్లడించారు.

## విదేశీ విద్యార్థులు రావడం అమెరికాలోని వ్యాపారాలకు మంచిది



**మొదటిపేజీ తరువాయి** – చదువుకునేందుకు ఎలాంటి ఆటంకాలు లేవని ఆయన స్పష్టం చేశారు. ఇది దేశంలోని ఉన్నత విద్యా వ్యవస్థకు ప్రోత్సాహకరంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల నుంచి అమెరికాకు వస్తోన్న విద్యార్థుల సంఖ్యను సగానికి తగ్గించాలనే ఆలోచనను ఆయన వ్యతిరేకించారు. అలా చేస్తే అమెరికాలోని విశ్వవిద్యాలయాలు, కళాశాలల వ్యవస్థ తీవ్రంగా నష్టపోతుం దని, అది జరగకుండా చూస్తానని ఆయన అన్నారు. ఇతర దేశాల విద్యార్థులు రావడం మంచి పరిణామమని ఆయన అభివర్ణించారు. తాను ప్రపంచంతో కలిసి ఉండాలని కోరుకుంటున్నానని ట్రంప్ అన్నారు.అమెరికాకు వచ్చేవారి సంఖ్యను సగానికి తగ్గిస్తే కొందరికి సంతోషం కలగవచ్చు కానీ కళాశాలలకు మాత్రం వ్యాపారం తగ్గిపోతుందని ఆయన అన్నారు. దేశీయ విద్యార్థుల కంటే విదేశీ విద్యార్థులే అధికంగా ఫీజులు చెల్లిస్తున్నారని ట్రంప్ తెలిపారు. ఇదిలా ఉండగా, అమెరికాకు వచ్చే విద్యార్థులకు సోషల్ మీడియా వెట్టింగ్ (సోషల్ మీడియా ఖాతాల పరిశీలన)ను తప్పనిసరి చేస్తూ అమెరికా ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.ం

## పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలపై కేసు నమోదు

**మొదటిపేజీ తరువాయి** – జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన పలువురిపై హైదరాబాద్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ క్రమంలో ముగ్గురు ఎమ్మెల్యేలపై సైతం కేసులు నమోదు కావడం గమనార్హం. ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, రామచంద్ర నాయక్, రాందాస్‌లపై మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు నమోదు కాగా, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, మెతుకు ఆనంద్‌లపై బోరబండ పోలీస్ స్టేషన్‌లో ఒక కేసు నమోదయింది.ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ పోలీసులు స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ఎన్నికలు శాంతియుతంగా, పారదర్శకంగా జరగాలంటే ప్రతి ఒక్కరు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని గౌరవించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తిస్తే డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ఆలోచనతో రండి.. పారిశ్రామికవేత్తలు కండి

**మొదటిపేజీ తరువాయి** – పెట్టుబడులతో ఏర్పాటైన 38 మెగా పారిశ్రామిక యూనిట్లను కూడా సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమం అనంతరం పలు జిల్లాల పారిశ్రామికవేత్తలతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు.

**పెట్టుబడులకు ఏపీ స్వర్గధామం**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయని చంద్రబాబు అన్నారు. "ఈ రోజు 99 కంపెనీలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసుకుంటున్నాం. వీటి ద్వారా రూ.2.65 లక్షల కోట్ల పెట్టుబడులతో 2 లక్షల మందికి ఉపాధి లభిస్తుంది. జనవరి నాటికి మరో 70 ఎంఎస్‌ఎంఈ పార్కులను ప్రారంభిస్తాం. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే మా లక్ష్యం" అని సీఎం వివరించారు.టెక్నాలజీ భవిష్యత్తును శాసిస్తుందని, అందుకే అమరావతిలో జనవరికి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. సౌర విద్యుత్, గ్రీన్ హైడ్రోజన్, బయో ఫ్యూయెల్ ప్లాంట్ల ఏర్పాటుతో ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధిస్తామన్నారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ, త్వరలోనే సెమీ కండక్టర్ పరిశ్రమ ఏర్పాటు కానున్నట్లు వెల్లడించారు. ఈ నెల 14, 15 తేదీల్లో జరిగే సీఐఐ భాగస్వామ్య సదస్సులో రూ.10 లక్షల కోట్ల విలువైన ఒప్పందాలు కుదుర్చుకోనున్నామని, తద్వారా 8 లక్షల ఉద్యోగాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

***గత పాలనపై తీవ్ర విమర్శలు***

గత ప్రభుత్వ హయాంలో పారిశ్రామికవేత్తలు రాష్ట్రం విడిచి పారిపోయారని, పరిశ్రమలు మూతపడ్డాయని చంద్రబాబు విమర్శించారు. "గతంలో పారిశ్రామికవేత్తలు 'ఛలోఛలో' అంటూ రాష్ట్రం నుంచి వెళ్లిపోతే, ఇప్పుడు 'భలేభలే' అంటూ తిరిగి వస్తున్నారు. విశాఖకు గూగుల్ సంస్థ లక్ష కోట్ల పెట్టుబడితో వస్తోంది. ఇదే మా ప్రభుత్వంపై ఉన్న నమ్మకం" అని అన్నారు.గత పాలకులు పీపీఏలు రద్దు చేసి, విద్యుత్ వాడకుండానే రూ.9 వేల కోట్లు చెల్లించారని, ఆ డబ్బు ఉండి ఉంటే ఎన్నో ప్రాజెక్టులు పూర్తయ్యేవని ఆవేదన వ్యక్తం చేశారు. ధ్వంసమైన ఏపీ బ్రాండ్‌ను పునరుద్ధరిస్తున్నామని, కేంద్ర ప్రభుత్వం ఏ పాలసీ తెచ్చినా దేశంలో మొదట అమలు చేసేది ఏపీనే అని స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పూర్తి సహకారం అందిస్తుండగా, మంత్రి లోకేశ్ పట్టువదలని విక్రమార్కుడిలా పనిచేస్తున్నారని ప్రశంసించారు.

***సంపద సృష్టి.. ప్రజల భాగస్వామ్యం***

రాష్ట్రంలో సంపద సృష్టించి, అందులో ప్రజలందరినీ భాగస్వాములను చేస్తామని చంద్రబాబు పునరుద్ఘాటించారు. "ఆలోచనలే ఇప్పుడు ఆస్తి. లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రైతులు కూడా ఎఫ్‌పీఓలు ఏర్పాటు చేసుకుని పారిశ్రామికవేత్తలుగా మారాలి," అని పిలుపునిచ్చారు. ఎంఎస్‌ఎంఈల ద్వారానే 5 లక్షల ఉద్యోగాలు కల్పించాలని నిర్ణయించామన్నారు. రామాయపట్నం పోర్టు సమీపంలో బీపీసీఎల్ సంస్థ లక్ష కోట్ల పెట్టుబడితో రిఫైనరీ ఏర్పాటు చేస్తోందని, పోర్టులను అభివృద్ధి చేసి రాష్ట్రాన్ని ఈస్ట్ కోస్ట్ లాజిస్టిక్స్ హబ్‌గా మారుస్తామని తెలిపారు. 15 శాతం వృద్ధి రేటు సాధించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

***వెనుకబడిన ప్రాంతాలకు పెద్దపీట***

వెనుకబడిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి పరిశ్రమలు, సాగునీరు అందిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. "2026 నాటికి వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రకాశం జిల్లాకు నీళ్లిస్తాం. కనిగిరి ఇకపై కనకపట్నం అవుతుంది. కరవు పీడిత ప్రాంతాలైన కనిగిరి, యర్రగొండపాలెం, గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాలకు గోదావరి జలాలను కూడా తీసుకొస్తాం. 2019లో మేం అధికారంలోకి రాకపోవడం వల్లే ఈ ప్రాజెక్టు ఆలస్యమైంది," అని అన్నారు. భవిష్యత్తులో ప్రజలకు ఇలాంటి కష్టాలు రాకుండా చూస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో పారిశ్రామిక పండుగ



**మొదటిపేజీ తరువాయి** – 50 ఎంఎస్‌ఎంఈ పార్కులకు వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. వీటితో పాటు ఇప్పటికే ఉత్పాదన దశకు చేరుకున్న రూ.25,256 కోట్ల పెట్టుబడులతో కూడిన 25 పరిశ్రమలను కూడా ఆయన వర్చువల్ విధానంలో ప్రారంభిం చారు.రెండో దశ ఎంఎస్‌ఎంఈ పార్కుల ఏర్పాటులో భాగంగా ఈరోజు 329 ఎకరాల్లో విస్తరించి ఉన్న 15 పారిశ్రామిక పార్కులను ముఖ్యమంత్రి ప్రారంభించారు. అలాగే మరో 587 ఎకరాల్లో 35 ప్రభుత్వ, ప్రైవేటు ఎంఎస్‌ఎంఈ పార్కుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి తదితర ప్రాంతాల్లో కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్న పారిశ్రామికవేత్తలతో సీఎం వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడారు.ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడటమే తమ కూటమి ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. "పారిశ్రామిక పార్కుల్లో విద్యుత్, నీళ్లు, రహదారుల వంటి అన్ని మౌలిక వసతులను ప్రభుత్వమే కల్పిస్తోంది. కేవలం ఆలోచనతో వస్తే చాలు, సులభంగా పారిశ్రామిక యూనిట్ పెట్టొచ్చు" అని ఆయన భరోసా ఇచ్చారు. చెత్త నుంచి సంపద సృష్టించడం నేటి ఆధునిక విధానమని, రాష్ట్రంలో ఏర్పాటవుతున్న కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లు ఈ దిశగా ముందడుగు వేయడం సంతోషకరమని అన్నారు. ఇది రైతులకు కూడా ప్రయోజనం చేకూరుస్తుందని తెలిపారు.

***గత పాలకుల హయాంలో పరిశ్రమలు మూతపడ్డాయి.. పారిశ్రామిక వేత్తలు పారిపోయారు***

గత పాలకుల హయాంలో రాష్ట్రంలో పరిశ్రమలు మూతపడ్డాయని, పారిశ్రామికవేత్తలు భయపడి పారిపోయారని చంద్రబాబు విమర్శించారు. "17 నెలల క్రితం సమస్యల సుడిగుండంలో ఉన్న రాష్ట్రంలో పాలన చేపట్టాం. ఏపీ బ్రాండ్‌ను పునరుద్ధరిస్తామని చెప్పాం. ఇప్పుడు రాష్ట్రంలో పెట్టుబడుల పండుగ నడుస్తోంది. యువతకు ఉద్యోగాలు ఇవ్వడమే కాదు, వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామని చెప్పిన హామీని నిలబెట్టుకుంటున్నాం" అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో మొత్తం 87 ప్రదేశాల్లో ఈ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాలు జరిగాయని తెలిపారు.

# ఏపీకి మరో భారీ పెట్టుబడి



**మొదటిపేజీ తరువాయి** – ఆంధ్రప్రదేశ్‌కు మరో భారీ పెట్టుబడి తరలివస్తోంది. దేశంలోనే అతిపెద్ద మల్టీ-లేయర్ ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్ (పీసీబీ) తయారీ యూనిట్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు ప్రముఖ ఎలక్ట్రానిక్స్ సంస్థ సిర్మా ఎస్‌జీఎస్ టెక్నాలజీస్ ముందుకొచ్చింది. తిరుపతి జిల్లా నాయుడుపేట సమీపంలో రూ.1,595 కోట్ల పెట్టుబడితో ఈ ప్లాంట్‌ను నెలకొల్పనున్నట్లు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ పరిశ్రమ ద్వారా 2,170 మంది యువతకు ఉన్నత నైపుణ్యం కలిగిన ఉద్యోగాలు లభిస్తాయని ఆయన తెలిపారు.ఈ పెట్టుబడి కేవలం ఒక పరిశ్రమ ఏర్పాటు మాత్రమే కాదని, రాష్ట్ర ప్రజల సామర్థ్యంపై ఉంచిన నమ్మకానికి నిదర్శనమని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్ని ఆచరణలో చూపిస్తున్నామని తెలిపారు. పరిశ్రమలు వేగంగా కార్యకలాపాలు ప్రారంభించేందుకు వీలుగా భూమి, నీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను ముందే సిద్ధం చేసి, తక్షణమే అందించే పరిష్కారాలను అందిస్తున్నామని వివరించారు.ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కంటే 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానమే ఏపీని ప్రత్యేకంగా నిలుపుతోందని మంత్రి అన్నారు. ఈ విషయాన్ని సిర్మా ఎస్‌జీఎస్ మేనేజింగ్ డైరెక్టర్ జేఎస్ గుజ్రాల్ మాటలు బలపరుస్తున్నాయని చెప్పారు. "మాకు వేగం అవసరం, అందుకే ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకు న్నాం" అని గుజ్రాల్ అన్నట్లు లోకేశ్ ఉటంకిం చారు. నైపుణ్యం కలిగిన మానవ వనరుల లభ్యత, ఓడరేవులకు సమీపంలో ఉండటం వంటి అను కూలతల వల్ల అత్యాధునిక తయారీ రంగ సంస్థలకు ఏపీ మొదటి ఎంపికగా మారిందని అభిప్రాయపడ్డారు.భారత్ ఏటా సుమారు 70 బిలియన్ డాలర్ల విలువైన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటోందని, ఈ కొత్త ప్లాంట్ ఏర్పాటుతో ఆ దిగుమతుల భారాన్ని తగ్గించడంలో సహాయపడుతుందని లోకేశ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పెట్టుబడి రాష్ట్రంలో బలమైన ఎలక్ట్రానిక్స్ తయారీ పర్యావరణ వ్యవస్థను నిర్మిస్తుందని, ఇది రాష్ట్రానికి, ప్రజలకు గర్వకారణమైన మైలురాయి అని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు.

# మా అమ్మాయి ఉగ్రవాదా?... నమ్మలేకపోతున్నాను!

**మొదటిపేజీ తరువాయి** –

ఈ ఘటనపై ఆమె తండ్రి సయ్యద్ అహ్మద్ అన్సారీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తన కుమార్తె ఇలాంటి కార్యకలాపాల్లో పాలుపంచుకుందంటే తాను నమ్మలేకపోతున్నానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.లక్నోలోని డాలిగంజ్‌కు చెందిన డాక్టర్ షాహీన్‌ను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ విషయంపై ఆమె తండ్రి సయ్యద్ అహ్మద్ మాట్లాడుతూ, "నాకు ముగ్గురు పిల్లలు. పెద్ద కొడుకు నాతోనే ఉంటున్నాడు. రెండో సంతానమైన షాహీన్‌ను నిన్న అరెస్ట్ చేశారు. చిన్న కొడుకు పర్వేజ్ అన్సారీ ఇంటిపై కూడా ఈ ఉదయం దాడులు జరిగాయి. అతను చాలా కాలం క్రితమే నగరం విడిచి వెళ్ళిపోయాడు" అని తెలిపారు. షాహీన్ ఫరీదాబాద్‌లో పనిచేస్తోందని, మహారాష్ట్రకు చెందిన వ్యక్తితో ఆమెకు వివాహం జరిగిందని చెప్పారు.గత ఏడాదిన్నరగా తాను షాహీన్‌ను గానీ, పర్వేజ్‌ను గానీ కలవలేదని ఆయన అన్నారు. "సుమారు నెల రోజుల క్రితం షాహీన్‌తో మాట్లాడాను. పర్వేజ్‌తో ప్రతీ వారం మాట్లాడు తాను. కానీ వాళ్ల బాగోగులు తప్ప మరే విషయమూ మేం చర్చించుకోలేదు. నా కుమార్తె ఇలాంటి పనుల్లో ఉందని తెలిసి షాక్‌కు గురయ్యాను" అని ఆయన వివరించారు.

***అసలేం జరిగింది?***

ఫరీదాబాద్‌లో కశ్మీర్‌కు చెందిన డాక్టర్ ముజమ్మిల్ అద్దెకు ఉంటున్న రెండు గదుల్లో పోలీసులు 2,900 కిలోల పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. అతడిని విచారించగా డాక్టర్ షాహీన్ పేరు బయటపడింది. షాహీన్ అల్-ఫలా యూనివర్సిటీ ఆసుపత్రిలో పనిచేస్తోందని, ముజమ్మిల్‌తో ఆమెకు సన్నిహిత సంబంధాలున్నాయని అధికారులు గుర్తించారు. ముజమ్మిల్ ఇచ్చిన సమాచారంతో షాహీన్‌కు చెందిన స్విఫ్ట్ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ కారులో ఒక ఏకే-47 రైఫిల్‌ను కూడా గుర్తించినట్లు తెలిపారు.

***ముమ్మరంగా దాడులు :***

ఈ కేసుకు సంబంధించి హరియాణా వ్యాప్తంగా దాడులు నిర్వహిస్తున్నామని డీజీపీ ఓపీ సింగ్ మంగళ వారం తెలిపారు. అల్-ఫలా యూనివర్సిటీ క్యాంపస్‌లో విస్తృతంగా సోదాలు జరుగు తున్నాయని, ఈ ఉగ్రకుట్రతో సంబ ంధం ఉన్న పలువురు అనుమా నితులను ప్రశ్నిస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, విద్యార్థులు,

సిబ్బంది సహా 52 మందిని విచారించినట్లు పోలీస్ వర్గాలు పేర్కొ న్నాయి. సోమవారం ఢిల్లీలోని ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడులో 8 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ ఘటన జరిగిన మరుసటి రోజే ఈ భారీ ఉగ్రకుట్రను భగ్నం చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. షాహీన్ అరెస్ట్ నేపథ్యంలో లక్నోలోని ఆమె తండ్రి నివాసానికి ఎన్ఐఏ, ఏటీఎస్ బృందాలు చేరుకుని విచారణ చేపట్టాయి.

# ముగిసిన జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పోలింగ్

**మొదటిపేజీ తరువాయి** – కేంద్రాలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రతతో పాటు 139 డ్రోన్లతో నిరంతర నిఘాను ఉంచి భద్రతా సిబ్బంది పర్యవేక్షించారు. అక్కడక్కడా చిన్న చిన్న ఉద్రిక్తలు తలెత్తగా పోలీసులు వాటిని అదుపులోకి తెచ్చారు. కాంగ్రెస్ తరఫున నవీన్ యాదవ్, బీఆర్ఎస్ తరఫున మాగంటి గోపీనాథ్ భార్య సునీత, బీజేపీ తరఫున లంకల దీపక్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. ఈ నెల 14న వీరి భవితవ్యం బహిర్గతం కానుంది.

**ప్రత్యేక యాప్‌లో పోలింగ్ సరళి :** పోలింగ్ సరళిని ఎన్నికల సంఘం ఆన్‌లైన్‌లో ప్రత్యేక యాప్ ద్వారా నమోదు చేసింది. ప్రిసైడింగ్ అధికారి ప్రతి రెండు గంటలకు ఒకసారి ఈ వివరాలను నమోదు చేశారు. ఓటర్ల సెల్‌ఫోన్లను పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించలేదు. సెల్‌ఫోన్ల డిపాజిట్ కోసం కేంద్రాల వద్ద ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. 58 మంది అభ్యర్థులు పోటీ చేస్తుండటంతో నాలుగు బ్యాలెట్ యూనిట్లు వినియోగించారు. ఒక్కో యూనిట్‌లో 16 మంది పేర్లు, ఫొటోలు ఉన్నాయి. చివరి బ్యాలెట్ యూనిట్‌లో 59వ నంబరుగా నోటా బటన్ అనేది ఉంటుంది.

**గత ఎన్నికల్లో జూబ్లీహిల్స్‌లో పోలింగ్ శాతం :** జూబ్లీహిల్స్‌లో పోలింగ శాతం కీలకంగా మారనుంది. గత ఎన్నికల సరళిని చూస్తే ఎప్పుడూ కూడా 50 శాతం దాటలేదు. 2024లో 45.59 శాతం మంది ఓట్లు వేశారు. 2023లో 47.58 శాతం మాత్రమే ఓట్లు పోలయ్యాయి. అదే 2019లో 39.89 శాతం, 2018లో 45.59 శాతం, 2014లో 50.18 శాతం ఓటింగ శాతం నమోదు అయింది. ఈ నియోజకవర్గంలో మొత్తం 4 లక్షల ఓట్లు ఉండగా, 2 లక్షల ఓట్లయినా పోల్ అవుతాయా అనేది ప్రశ్నగా మిగిలింది. ఈసారి పోలింగ్ శాతాన్ని పెంచేందుకు అదనంగా 1 గంట సమయాన్ని పొడిగించారు.

**ఓటర్లను తరలించేందుకు పార్టీల నేతలు పోటాపోటీ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటర్లను తరలించేందుకు పార్టీల నేతలు పోటాపోటీగా ఏర్పాట్లు చేసుకున్నారు. నివాస స్థలాలకు దూరంగా బూత్‌లు ఉండటంతో వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులను తామంటే తాము తరలిస్తామని ముందే ఒప్పందం చేసుకుంటూ పోటీ పడ్డారు. ఇరుకైన రహదారులుండే బస్తీలు అధికంగా ఉండటంతో ఒక్కో పార్టీ డివిజన్‌కు వందల సంఖ్యలో ఆటోలను సైతం బుక్ చేసుకున్నాయి. వృద్ధులు, దివ్యాంగులను తీసుకెళ్లి ఓటేసిన అనంతరం క్షేమంగా ఇంటికి చేరుస్తామని హామీ ఇచ్చారు.

# అందెశ్రీ పాడెను మోసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**మొదటిపేజీ తరువాయి** – తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ పాడెను మోశారు. అందెశ్రీ అంత్యక్రియలు హైదరాబాద్ నగర శివారులోని ఘట్‌కేసర్‌లో నిర్వహించారు. ఈ అంతిమ సంస్కారాలకు రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. అంతిమ యాత్రలో అందెశ్రీ పాడెను రేవంత్ రెడ్డి మోశారు. తెలంగాణ ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మంత్రులు శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అందెశ్రీ అంత్యక్రియల అనంతరం ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడారు.

***వ్యక్తిగతంగా, తెలంగాణ సమాజానికి లోటు: రేవంత్ రెడ్డి***

అందెశ్రీ మరణం వ్యక్తిగతంగా తనకు, తెలంగాణ సమాజానికి తీరని లోటు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో రాష్ట్రం గురించి అనేక విషయాలు ఆయనతో చర్చించినట్లు తెలిపారు. అందెశ్రీ రాసిన 'జయ జయహే తెలంగాణ'ను రాష్ట్రగీతంగా నిర్ణయించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అందెశ్రీ ప్రతి మాట ప్రజా జీవితం నుంచి పుట్టుకు వచ్చిందని అన్నారు. ప్రతి పాట తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని నింపిందని అన్నారు.'జయ జయహే తెలంగాణ' గీతాన్ని పాఠ్యపుస్తకాల్లో చేరుస్తామని అన్నారు. అందెశ్రీ కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని అన్నారు. తన జీవితాన్ని ప్రజల కోసం త్యాగం చేసిన మహనీయుడు ఆయన అని అన్నారు. ఆయన రచనలకు సంబంధించిన 'నిప్పులవాగు' పుస్తకాన్ని ప్రతి గ్రంథాలయంలో అందుబాటులో ఉంచుతామని అన్నారు.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
బుధవారం 12-11 - 2025

## ముఖ్యమంత్రి సహాయ నిధి పేద కుటుంబాలకు ఓ వరం

### ఎమ్మెల్సీ నెల్లి కంటి సత్యం



**చౌటుప్పల్, నవంబర్ 11 ( తెలంగాణ సేన) :** ముఖ్యమంత్రి సహాయనిధి పథకం పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. బుధవారం చౌటుప్పల్ పట్టణంలోని సిపిఐ మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చౌటుప్పల్, నారాయణపురం మండలాలకు చెందిన పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సత్యం మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ప్రవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పేదవారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా కొంత లబ్ధి చేకూరుతుందని అన్నారు. పేద ప్రజలు ఎవరైనా అత్యవసర పరిస్థితుల్లో ప్రవేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకుంటే ఆరు నెలల లోపు దరఖాస్తు చేసుకోవాలని, ఈ ముఖ్యమంత్రి సహాయనిధి ఆపదలో ఉన్న పేదవాళ్లకు అండగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ శాఖ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, నాయకులు ఉడత రామలింగం, కొండూరు వెంకటేష్, రొండి నరసింహ, టంగుటూరి రాములు, రోషణగారి అంజయ్య, బద్దుల సుధాకర్, నీల బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## వేణునగర్ అంగన్వాడీ టీచర్ నిర్లక్ష్యంపై విచారణ

### కలెక్టర్ ఆదేశాలతో కదిలిన అధికారులు




**ఖానాపూర్ :నవంబర్ 07:తెలంగాణ సేన న్యూస్. :** పెంబి: మండలంలోని వేణునగర్ గ్రామంలోని అంగన్వాడీ టీచర్ నాగలక్ష్మి నిర్లక్ష్యం కారణంగా ఈ నెల 1న ఆత్రం పుష్ప అనే చిన్నారి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి తీసిన పిల్లర్ గుంతలో పడి మృతి చెందిన ఘటనపై అధికారులు విచారణ చేపట్టారు. ?ఈ విషాదకర ఘటన జరిగిన తర్వాత, అంగన్వాడీ టీచర్ నిర్లక్ష్యమే చిన్నారి పుష్ప మృతికి కారణమని ఆరోపిస్తూ... గత నాలుగు రోజుల క్రితం వేణునగర్ గ్రామస్థులు, బాధిత కుటుంబ సభ్యులు కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో, మంగళవారం కలెక్టర్ కార్యాలయం నుండి అధికారులు వేణునగర్ గ్రామానికి వచ్చి విచారణ చేపట్టారు. ఈ విచారణలో భాగంగా వారు గ్రామస్థులు, బాధిత కుటుంబ సభ్యుల వాంగ్మూలాన్ని రికార్డు చేసుకున్నారు. జరిగిన విచారణ వివరాలను ఉన్నతాధికారులకు అందజేస్తామని అధికారులు తెలిపారు.

## రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రముఖులు



**హైదరాబాద్, నవంబర్ 11:తెలంగాణ సేన న్యూస్. :** నూతనంగా నియమితులైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డిని మంగళవారం పలువురు ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు జి. విఠల్ రెడ్డి, బోథ్ మాజీ ఎమ్మెల్యే బాపూరావు, మాజీ రాష్ట్ర డైరీ చైర్మన్ లోక భూమా రెడ్డి, శ్యామ్ నాయక్ లు ఆయనను భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు సుదర్శన్ రెడ్డికి అభినందనలు తెలియజేసి, రాష్ట్రాభివృద్ధి దిశగా ఆయన నాయకత్వంలో ప్రభుత్వం మరింత సమర్థవంతంగా ముందుకు సాగుతుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

## వంగపల్లి అంజయ్య స్వామికి ఆహ్వాన పత్రిక అందజేత



**తెలంగాణ సేన :** యాదగిరిగుట్ట లోని లోటస్ టెంపుల్ 12వ వార్షికోత్సవ వేడుకలకు హాజరుకావాలని కోరుతూ వాసవి కన్యకాపరమేశ్వరి,రేణుక ఎల్లమ్మ ఆలయం వ్యవస్థాపక అధ్యక్షుడు,వాసవి ఉపాసకులు, అర్చక స్వాములు, ఐవిఎఫ్ రాష్ట్ర ఆధ్యాత్మిక కమిటీ చైర్మన్ డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామికి ఆహ్వాన పత్రికను అందజేశారు. లోటస్ టెంపుల్ ప్రధాన అర్చకులు గౌరీభట్ల శంకర శర్మ, అధ్యక్షులు బెజ్జగం వెంకట నరసయ్య, కోశాధికారి బచ్చు చండీశ్వర్, కార్యదర్శి ఇమ్మడి శ్రీనివాసులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈనెల 12, 13,14 తేదీలలో జరిగే పుష్కర ఉత్సవాలకు రావాలని ఈ సందర్భంగా అంజయ్య స్వామిని కోరారు.

## మంత్రి కోమటిరెడ్డిని కలిసిన ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్



**ముధోల్:నవంబర్ 07:తెలంగాణ సేన న్యూస్. :** ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ మంగళవారం రాష్ట్ర రోడ్లు, భవనాల మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముధోల్ నియోజకవర్గంలోని ప్రధాన రహదారుల అభివృద్ధికి సంబంధించిన పలు ప్రతిపాదనలు మంత్రి గారికి సమర్పించారు. వానల్ పాడ్ నుండి వంజార, సోనారి నుండి కుబీర్, మలేగావ్ నుండి వర్ని వరకు రోడ్డు నిర్మాణాలకు హమ్ పథకం ద్వారా నిధులు మంజూరు చేయాలని పవర్ రామారావు పటేల్ కోరారు..దీనికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సానుకూలంగా స్పందించి త్వరలో నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గౌరవ మంత్రివర్యులకు పవర్ రామారావు పటేల్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## బైంసా డిగ్రీ కళాశాలలో నేషనల్ ఎడ్యుకేషన్ డే ఉత్సవాలు

### ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి



**బైంసా, నవంబర్ 07:తెలంగాణ సేన న్యూస్. :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బైంసాలో నేడు నేషనల్ ఎడ్యుకేషన్ డే సందర్భంగా మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె. రఘునాథ్ మాట్లాడుతూ ు భారత తొలి విద్యామంత్రిగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా, దేశ విద్యా వ్యవస్థకు బాటలు వేసిన మహానుభావుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని పేర్కొన్నారు. అలాగే జాతి నేత బిర్సా ముండా జయంతిని సైతం కళాశాలలో నిర్వహించారు. బ్రిటిష్ పాలనలో జరిగిన మిలీనేరియన్ ఉద్యమానికి బిర్సా ముండా సారథ్యం వహించి ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన వీరుడని ఆయన గుర్తుచేశారు. ఇక ప్రముఖ కవి, సామాజిక కార్యకర్త అందెశ్రీ వర్ధంతి సందర్భంగా ఆయనను స్మరించి శ్రద్ధాంజలి ఘటించారు. తెలుగు సాహిత్యం ఒక చైతన్య దీపికను కోల్పోయిందని ప్రిన్సిపాల్ రఘునాథ్ అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఉద్యమం నుంచి సామాజిక చైతన్యానికి అందెశ్రీ సాహిత్యం దారిచూపిందని అన్నారు. విద్యార్థుల్లో జాతీయ స్ఫూర్తి, సేవాభావం పెంపొందించడమే ఈ కార్యక్రమాల ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు ఆర్. రాజు, డా. జాదవ్ ఓం ప్రకాష్, అధ్యాపకులు డా. భీమరావు, డా. పవన్‌కుమార్, యు. రవికుమార్, డా. శంకర్, డా. సంతోష్ కుమార్, డా. నహీదా, డా. కల్పన, మజర్ ఆర్షియా, వహీద్ ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు, కార్యాలయ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కన్నెకల్ లో రైతులకు.. కన్న తిప్పలు

### కొనుగోలు కేంద్రం లో ధాన్యం తూకంలో మోసమంటూ ఆరోపణలు

### హమాలి, డ్రైవర్ మామూళ్ళంటూ వసూళ్లు చేస్తున్నారని రైతుల గగ్గోలు



**మాడ్గుల పల్లి, నవంబర్ 11,( తెలంగాణ సేన):** రైతులను కష్టాలు వెంటాడుతున్నాయి.. ఒకవైపు ప్రకృతి కన్నెర్ర చేస్తుండగా.. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు నాన్న అగచాట్లు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మధ్యదళారులకుఅమ్మి మోసపోకుండా ప్రభుత్వమే ఐకెపి, పిఎసిఎస్ ల ఆధ్వర్యం లో ధాన్యం కొరుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధర అందించాలని కృతనిశ్చ యంతో ఉన్నప్పటికీ కిందిస్థాయి సిబ్బంది నిర్వాకంతో రైతులు గోస పడుతూనే ఉన్నారు. కొనుగోలు కేంద్రాలలో కొందరుఅవినీతిఅధికారుల చేష్టల వల్ల పలురకాల అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికే బోనస్ సొమ్మును కొట్టేసే ఉదాంతం ఇటీవల వెలుగులోకి వచ్చి అవినీతి అక్రమాలకు పాల్పడిన పిఎసిఎస్ సిబ్బందిని కలెక్టర్ సస్పెండ్ చేసినప్పటికీ కొందరి తీరు మారడం లేదు. మాడుగుల పల్లి మండలంలోని కన్నెకల్ లో నిడమనూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వ ర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో స్థానికుడైన సిబ్బంది ఒకరికి కొనుగోలు బాధ్యతలు అప్పగించడంతో తన ఇష్టానుసారంగా నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతులు కన్నెకల్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోసి పాడిగాపులు కాస్తున్న సీరియల్ ను మెంటైన్ చేయకుండా ముందు వచ్చిన రైతుల ధాన్యాన్ని కాంటాలు వేయకుండా తనకిష్టమైన వ్యక్తులకు సంబంధించిన దాన్యం ఎప్పుడు వచ్చిన కాంటాలు వేస్తున్న విషయం బహిరంగ రహస్యమేనని రైతుల సమాచారం. ధాన్యం కొనుగోలు కేంద్రంలో కనీససౌకర్యాలను ఏర్పాటు చేయకపోగా, రైతుల నుండిఅధిక తూకం హ మాలి మామూలు, లారీ డ్రైవర్ మామూలు, ఇతర ఖర్చుల పేరుతో రైతుల నుండి ధాన్యాన్ని సేకరిస్తూ నిర్వాహకులు మోసాలకుపాల్పడుతున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. కొనుగోలు కేంద్రంలో కనీస సౌకర్యాలైన టెంటు, విద్యుత్, త్రాగునీటి సౌకర్యం, పట్టా లు లేకపోవడం శోచనీయం. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా దాన్యం కొనుగోలు కేంద్రం లోపలికి లారీ వచ్చే అవకాశం లేకపోవడంతో ఇదే అదునుగా లారీని రోడ్డుపై నిలిపి ఉంచి,కాంటాలు వేసిన ధాన్యాన్ని లారీలో వేసి పంపించడానికి సొంతంగా ట్రాక్టర్ ను ఏర్పాటు చేసుకొని బస్తాకు రూ.5 రూపాయలు కిరాయి చెల్లించడం తో పాటు లారీకి అదనంగా బస్తాకు రూ .1 రూపాయి చెల్లించాలంటూ రైతునుండి బస్తా కు ఆరురూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు.40.700 కిలోల చొప్పున కాంటా వేయాల్సి ఉండగా 42 కేజీల చొప్పున కంట వేస్తూ మోసాలకు పాల్పడుతున్నారని రైతులు ఆరోపణ వ్యక్తం చేస్తున్నారు.

**అధికారులను ఆశ్రయించిన ఆగని అవినీతి :-**

మాడ్గులపల్లి మండలం కన్నెకల్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిర్వాహకుల వ్యవహార శైలి పై స్థానిక రైతులు డి ఎస్ ఓ కు ఫిర్యాదు చేయగా స్పందించిన డి.ఎస్.ఒ కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టా లని అధికారిణి ని ఆదేశించడం జరిగింది. ధాన్యం కొనుగోలు కేంద్రంలో జరిగిన అవినీతిని అడ్డుకట్టవేసి అవినీతి కి పాల్పడిన నిర్వాహకులపై చర్యలు చేపట్టాల్సి ఉండగా రైతుల తో మాట్లాడి ఇక నుండి ఇలాంటి సంఘటనలు జరగబోవు అని రైతులను స్థానిక నిర్వాహకులను సమన్వయం చేసి నట్లు సమాచారం.దీంతో అధికారులు వారు వారు ఏకమైతే అవినీతి ఎలా బయటికి వస్తుంది అంటూ రైతులు గుసగుసలాడుకుంటున్నారు.ఇప్పటి కైనా ఉన్నతాధికారులు స్పందించి ఐకెపి కేంద్రాలలో జరుగుతున్న అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టి ఆరుగాలం అష్టకష్టాలు పడి పంటలు సాగుచేసిన రైతుల ధాన్యానికి మద్దతు ధరను అందించి అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.ఈ విషయమై వివరణ కోరేందుకు నిడమనూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శి తో పాటు విచారణ అధికారిణి ని ఫోన్ లో సంప్రదించిన ప్పటికీ స్పందించకపోవడం గమనార్హం .

## రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వడ్ల కొనుగోలు జరుగుతుందని హామీ

### కారుకొండ, కూచూర్, ఇప్పటూరు, నవాబ్ పేట్ గ్రామాల్లో వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

### ఎన్మన్ గండ్ల గ్రామంలో ప్రభుత్వ వసతిగృహం, జూనియర్ కళాశాల తరగతి గదుల నిర్మాణాలకు శంకుస్థాపన

### విద్యా వసతుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

### జడ్చర్ల నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా సాగుతున్నాయి: ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**తెలంగాణ సేన న్యూస్ జడ్చర్ల :**జడ్చర్ల శాసనసభ్యులు శ్రీ జనంపల్లి అనిరుధ్ రెడ్డి గారు నిన్న నవాబ్ పేట్ మండలంలోని వివిధ గ్రామాలలో వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కారుకొండ (ఐకేపీ), కూచూర్ (%ళూాజూ%), ఇప్పటూరు (%ళూాజూ%), నవాబ్ పేట్(ఐకేపీ) గ్రామాలలో వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులతో సంభాషించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి గారు... ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ప్రతి గ్రామంలో వడ్ల కొనుగోలు సజావుగా జరిగేలా అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మద్దతు ధరల వద్ద వడ్లు కొనుగోలు జరుగు తాయని హామీ ఇచ్చారు.అంతేకాక, ఎమ్మెల్యే గారు ఎన్మన్ గండ్ల గ్రామంలోని ప్రభుత్వ వసతిగృహం మరియు జూనియర్ కళాశాలలో నిర్మించబడనున్న నూతన తరగతి గదుల భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ నిర్మాణాలు పూర్తవుతే గ్రామంలోని విద్యార్థులకు మెరుగైన వసతులు లభిస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు .కార్యక్రమంలో %ూవీజ% మార్కెట్ చైర్మన్ హరి లింగం, వైస్ చైర్మన్ తులసీరాం నాయక్, డైరెక్టర్లు, మండల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలకు పూర్వ విద్యార్థి చేయూత




**తెలంగాణ సేన నవంబర్ 11 ( బాసర ప్రతినిధి )** నిర్మల్ జిల్లా :-బాసర మండలం ఓని గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థుల కోసం పూర్వ విద్యార్థి కదం యోగేష్ పాఠశాలకు అవసరమైన విలువైన canon colour printer ను విరాళం గా ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్, టీచర్ మౌనిక చేతుల మీదుగా అందజేశాడు. సుమారు వీటి విలువ 6500 రూపాయల వరకు ఉంటుందని అన్నారు.ఇక్కడే ప్రభుత్వ పాఠశాలలో 20 సంవత్సరాల క్రితం చదివి ఇదే పాఠశాలకు తనకు తోచిన కాడికి ఆర్థిక సాయం అందించినందుకు నాకు ఎంతో ఆనందంగా ఉందని యోగేష్ అన్నారు

## మహబూబాబాద్ జిల్లా ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం (ట్రాస్మా)ఆధ్వర్యంలో ఉపాధ్యాయుని రాలికి ఆర్థిక సహాయం



**మహుబుబాబాద్ జిల్లా తెలంగాణ సేన నవంబర్ 11:** మహబూబాద్ జిల్లా యాజమాన్యం ట్రస్వ ఆధ్వర్యంలో జిల్లాలోని కృష్ణవేణి పాఠశాలలో పనిచేస్తున్న నాగుల నాగమణి వారి భర్త ప్రసాద్కు ఇటీవలనే క్యాన్సర్ బారిన పడ్డాడు అతనికి వైద్యానికి ఖర్చు బాగా అవుతుంది ఇది గమనించిన ప్రిన్సిపల్ భూపాల్ రెడ్డి జిల్లా యాజమాన్యం దృష్టికి తెలియజేయగానే జిల్లా అధ్యక్షులు చిత్రా యకాంతం గౌడ్ గారి ఆధ్వర్యంలో ఈరోజు కృష్ణవేణి పాఠశాలలో సదరు మహిళా టీచర్ కు 30 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏకాంతం గౌడ్ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ మన పాఠశాలలో పనిచేస్తున్న వారు అంటే మన కుటుంబ సభ్యులు వారు దుఃఖంలో ఉన్నప్పుడు మన సహాయం చేయకుండా ఎలా ఉండగలం అందుకనే వెంటనే స్పందించి అందరి యాజమాన్యాల సహకారంతో ఈ ఆర్థిక సాయం అందజేయడం జరిగింది. ఇలాంటి కార్యక్రమాలు మునుముందు తప్పకుండా ఎవరైనా ఆపదలో ఉన్నవారికి ఆదుకుంటామని తెలియజేశారు ఇంకా ఈ కార్యక్రమంలో ట్రస్మా సెక్రటరీ అప్పారావు ట్రెజరర్ నరేష్ రెడ్డి వైస్ ప్రెసిడెంట్ సురేష్ మండల్ ప్రెసిడెంట్ కృష్ణమూర్తిలు ఇంకా వివిధ ప్రవేటు పాఠశాల కరస్పాండెంట్ లు భూపాల్ రెడ్డి, శ్రీనివాస్, మల్లారెడ్డి, సాబీర్,సురేష్ తదితరులు పాల్గొన్నారు

## సంతోషిమాత ఆలయంలో ఘనంగా ఆకాశ దీపోత్సవం



**తెలంగాణ సేన :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ లోని శ్రీ సంతోషిమాత, శ్రీ సత్య నారాయణ స్వామి సహిత ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా పురోహితులు దేశపతి రాజశేఖర శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో ఉదయం సాయంత్రం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు అందులో భాగంగా మంగళవారం సాయంత్రం ఆకాశ దీపోత్సవం కనుల పండుగగా నిర్వహించారు, అనంతరం దేశపతి రాజశేఖర్ శర్మ మాట్లాడుతూ శివకేశవులకు ప్రీతి పాత్రమైన కార్తీకమాసంలో ఆలయాల్లో పూజలు నిర్వహించిన దీపారాధన చేసిన మహా పుణ్యం లభిస్తుందని ఆకాశ దీపారాధన వల్ల సర్వ పాపాలు తొలగిపోయి అష్టైశ్వర్యాలు చేకూరుతాయని సంతోషిమాత ఆలయంలో ప్రతిరోజు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని నాచారంలో నిర్వహించిన హరిద్ర నదికి దీపారాధన కార్యక్రమంలో పాల్గొన్న సంతోషిమాత సేవా పరిషత్ సభ్యులు ఆర్యవైశ్యులకు అభినందనలు తెలిపారు,కార్తీక మాసం సందర్భంగా ప్రతి సంవత్సరం నిర్వహించే కార్తీక వనభోజనాల కార్యక్రమం శ్రీ సంతోషి సేవా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్తీక వనభోజనం మహోత్సవం ఆదివారం నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు

## కేజీబీవి పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా విద్యాధికారి






**ముధోల్:11నవంబర్(తెలంగాణ సేన న్యూస్) :** మండల కేంద్రమైన ముధోల్ లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం జిల్లా విద్యాధికారి భోజన్న తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణ చదువుకోవాల్లన్నా రు . పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించాలని అన్నారు. అనంతరం విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ ఫరత్ బేగం ఏ ఎస్ పీ సమన్వయ కోఆర్డినేటర్ లింబాద్రి తో పాటు ఉపాధ్యాయులు ఉన్నారు

## తెలంగాణ ఆదివాసి జాగృతి రాష్ట్ర అధ్యక్షులు లోకిని రాజు ఆధ్వర్యంలో పలువురు చేరిక

### ఆదివాసి రాష్ట్ర కోశాధికారిగా చెడుమాకి బిక్షపతి



**తెలంగాణ సేన హుజురాబాద్ ప్రతినిధి నవంబర్ 11 :** ఆదివాసి తోటి సంఘానికి రాష్ట్ర కోశాధికారిగా ఎంపికైన కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలంలోని గణేష్ నగర్ కు చెందిన చెడుమాకి బిక్షపతిని శాలువాతో సత్కరించి తెలంగాణ జాగృతిలోకి ఆహ్వానించడం జరిగింది.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు మాట్లాడుతూ రాజ్యాంగ పరంగా రావలసిన ఆదివాసి హక్కుల కోసం ప్రతి ఒక్క ఆదివాసి బిడ్డ ప్రశ్నించే గొంతుగలా చైతన్యం కావాలని పిలుపునిచ్చారు.అందులో ప్రథమంగా తెలంగాణ ఆదివాసి జాగృతి నిర్మాణ దశలో ఉన్నందున ఆదివాసీ నాయకులు విచ్చేసి ఆదివాసి ఉద్యమ పంతాను ముందుకు తీసుకువెళ్లాలని కోరారు.అందుకు ఆదివాసి జాగృతి తమ వెంట నిలుస్తుందని ఈసందర్భంగా అన్నారు.ఆదివాసి తోటి తెగ విద్యా , ఉద్యోగ, ఉపాధి రంగాల్లో చాలా వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తపరచారు.అన్ని రంగాలలో ఆదివాసి తోటి జాతితో పాటు అన్ని ఆదివాసి తెగలు అంచలంచలుగా ఎదగాలని ప్రతి ఉద్యమంలో జాతి సమస్యలు పరిష్కరించడంలో ముందుండి,ఆదివాసి ఆకలి అరుపులను భావి తరాలకు మరియు సమాజానికి తెలియ చెప్పడంలో మరియు పరిష్కరించే దిశగా ప్రతి ఘటిస్తున్న ఉద్యమ నాయకుల వెన్నంటి నడివాలని మరియు తమ సమస్యలను పరిష్కరించుకునే దిశలో పోరాటాలు ఉండాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసి జాగృతి జగిత్యాల జిల్లా అధ్యక్షు కురుసంగి వేణు, ఆదివాసి జాగృతి పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు ఆత్రం పురుషోత్తం, నిజమాబాద్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షులు మడావి మంజుల,ఆదివాసి జాగృతి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు కూతాడ శ్రీనివాస్ కరీంనగర్ జిల్లా జాగృతి నాయకులు కుతాడి కుమార్, తోటి యువజన సంఘం కరీంనగర్ జిల్లా కో కన్వీనర్ శడుమాకి వీరయ్య తదితరులు పాల్గొన్నారు

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించిన మాగంటి సునీత గోపీనాథ్.



**తెలంగాణ సేన న్యూస్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సందర్భంగా ఎల్లారెడ్డిగూడా నవోదయ కాలనీలోని శ్రీ కృష్ణదేవరాయ నగర్ వెల్ఫేర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీమతి మాగంటి సునీత గోపీనాథ్ కుటుంబ సభ్యులతో కలిసి తన ఓటు హక్కును వినియోగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ –ꀠ "ఓటు హక్కు అనేది భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన ప్రాథమిక హక్కు.ప్రజలందరూ తప్పక తమ ఓటు హక్కును వినియోగించి ప్రజాస్వామ్యాన్ని బలపరచాలి" అని పిలుపునిచ్చారు.

# చదవలేక అడవిలోకి పారిపోయిన విద్యార్థులు

**4 రోజులు గుహలోనే**

**మూడు బృందాలు పోలీసుల గాలింపులు**

**డ్రోన్ల సహాయంతో వెతకగా కొండల్లోని గుహలో ఆచూకీ**



సాధారణంగా పిల్లలు బడికి వెళ్లమని మారాం చేయడం సహజమే. ప్రతిరోజు వారిని బడికి పంపించడం చాలా కష్టమే. అలవాటు అయ్యేవరకు ఈ తతంగం కొనసాగుతూనే ఉంటుంది. ఇంటి దగ్గర ఉండి చదవరనో, ఆర్థిక స్తోమత లేక ప్రభుత్వ హాస్టళ్లలో జాయిన్ చేసిన పిల్లల పరిస్థితి అయితే మరీ దారుణంగా ఉంటుంది. వాళ్లు హాస్టళ్లలో ఉండలేక తప్పించుకుని పారిపోయే ఘటనలు చాలా జరుగుతూనే ఉంటాయి. అంతేకాదు ఎప్పుడైనా వాళ్లను చూసేందుకు తల్లిదండ్రులు, బంధువులు హాస్టల్ దగ్గరకు వెళ్తే తమ వెంటే వస్తామని మారాం చేయడం లాంటివి చూస్తూనే ఉంటాం.ఇక కొందరు విద్యార్థులైతే చదువు ఒంటబట్టక ఎప్పుడూ గ్రౌండ్‌లోనే కనిపిస్తూ ఉంటారు. ఇలా చదవడం ఇష్టం లేకపోతే వేరే వ్యాపకంలో మునిగి సమయాన్ని గడుపుతుంటారు. మార్కులు తక్కువగా వస్తే కొంత బాధ పడ్డా మళ్లీ స్నేహితులతో కలిసి అన్నీ మర్చిపోతారు. కానీ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఓ పాఠశాల విద్యార్థులు ఇద్దరు తమకు చదువు అబ్బడం లేదని ఏకంగా అడవిలోకి పారిపోయారు. అసలేం జరిగింది? ఇప్పుడు వారు ఎక్కడ ఉన్నారు? అని తెలుసుకోవాలంటే ఈ కథనం చదవాల్సిందే.

**దుంపలు తింటూ గుహలో తలదాచుకున్నారు :** చదువులో వెనకబడ్డామని పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థినులు కారడవిలోకి పారిపోయిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. నాలుగు రోజుల పాటు దుంపలు తింటూ అక్కడి నీరు తాగుతూ గుహలో దాక్కున్నారు. డ్రోన్ల సహాయంతో పోలీసులు గాలించగా సోమవారం దొరికారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం గుల్లెలు పంచాయతీ కించూరు గ్రామానికి చెందిన బాలికలు పెదబయలు ఆశ్రమ బాలికల పాఠశాల-1లో ఆరు, ఐదో తరగతులు చదువుతున్నారు.


**డ్రోన్లు పట్టించాయి :** ఈ నెల 6న వీరిద్దరూ పాఠశాల నుంచి పరారయ్యారు. 8న పాఠశాల సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి ఎస్సై కొల్లి రమణ ఆధ్వర్యంలో మూడు బృందాలు వీరి కోసం గాలించాయి. సోమవారం డ్రోన్ల సహాయంతో గాలింపు చేపట్టగా కొంచూరు కొండల్లోని గుహలో వీరు తలదాచుకున్నట్లు గుర్తించారు. వెంటనే గ్రామస్థుల సహకారంతో ఇద్దరినీ పట్టుకుని సాయంత్రం తల్లిదండ్రులకు అప్పగించారు. ఇద్దరు పిల్లలు ఇంటికి క్షేమంగా తిరిగి రావటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# భక్తులకు మరిన్ని డిజిటల్ సేవలు

**ఆలయాల్లో సులభంగా అన్ని రకాల టికెట్లు**

**ఆలయాల్లో డిజిటల్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేలా దేవాదాయశాఖ చర్యలు**

**ఈ పోస్ యంత్రాల ద్వారా టికెట్లు జారీ**



భక్తులకు దేవాదాయశాఖ గుడ్?న్యూస్ తెలిపింది. ఇకపై దర్శన టికెట్ల కోసం వేచి చూడకుండా ఉండేదుకు ఓ నూతన విధానం అమల్లోకి తెచ్చింది. దీనివల్ల భక్తులు సులభంగా దర్శనాలు, సేవలు, పార్కింగ్ టికెట్లు పొందొచ్చు. ఈ విధానం ప్రధాన, ముఖ్య ఆలయాల్లో డిజిటల్ సేవలు మరింతగా అందుబాటులోకి తీసుకువచ్చేలా దేవాదాయశాఖ చర్యలు చేపట్టింది. ఇప్పటికే భక్తులే నేరుగా స్వయంగా టికెట్లు పొందేలా వివిధ ఆలయాల్లో 100 కియోస్క్‌ల ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. తాజాగా దర్శనాలు, సేవలు, పార్కింగ్ టికెట్ల జారీకి ఈ పోస్ యంత్రాలు ఉపయోగించేలా కమిషనర్ రామచంద్రమోహన్ ఆదేశాలు జారీ చేశారు.మార్గశిర మాసంలో విశాఖపట్నంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో భక్తుల రద్దీ భారీగా ఉండనుంది. ఈ సందర్భంగా టికెట్ల జారీకి రోడ్డుపై కౌంటర్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీనికి బదులుగా ఈ పోస్ యంత్రాలు అందించేందుకు ఎస్‌బీఐ ముందుకు వచ్చింది. ఇందులో జెనీ యాప్ ఉంటుంది. ఈ యంత్రాలను దేవాదాయశాఖకు చెందిన టెంపుల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌కు అనుసంధానించి ఎక్కడికక్కడ భక్తులకు ఆయా టికెట్లు జారీ చేయనున్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రధాన, ముఖ్య ఆలయాలు అన్నింటా ఎస్‌బీఐ అందజేసే ఈ పోస్ యంత్రాలు వినియోగించుకోవాలని కమిషనర్ ఆదేశించారు.

**వాట్సప్ కౌంటర్లు ఏర్పాటు :** ప్రభుత్వం మనమిత్ర యాప్‌తో అనేక సేవలు అందిస్తుండగా, అందులో వివిధ ఆలయాల దర్శనాలు, సేవలు, వసతుల బుకింగ్ వంటి సదుపాయం కూడా ఉంది. దీనిపై మరింతగా భక్తులకు అవగాహన కల్పించేలా అన్ని ప్రధాన, ముఖ్య ఆలయాల్లో ప్రత్యేక వాట్సప్ కౌంటర్లను ఏర్పాటు చేయాలని కమిషనర్ ఆదేశించారు. అందులో మనమిత్ర యాప్‌ద్వారా దర్శనం, సేవలు తదితర టికెట్లు ఎలా బుక్ చేసుకోవాలో భక్తులకు తెలియజేయాలని పేర్కొన్నారు.

**రియల్ టైమ్ సమాచారంతో డ్యాష్‌బోర్డ్ :** ఆలయాలకు చెందిన రియల్‌టైమ్ సమాచారంతో దేవాదాయశాఖ డ్యాష్‌బోర్డ్ సిద్ధం చేసింది. ఆలయాల జాబితా, వాటి భూములు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ట్రస్ట్ బోర్డులు, ప్రధాన, ముఖ్య ఆలయాలకు ఏ రోజు ఎంత మంది భక్తులు వచ్చారు తదితర సమాచారం అంతా ఇందులో, రియల్‌టైమ్‌లో అందుబాటులో ఉంచారు. ఈ డ్యాష్ బోర్డును సీఎం కార్యాలయం సహా ఇతర ఉన్నత అధికారులు, కమిషనరేట్ అధికారులు ఎప్పుడైనా చూసేలా ఏర్పాట్లు చేశారు.

**100 కియోస్క్‌లు ఏర్పాటు :** రాష్ట్రంలోని ప్రధాన, ముఖ్య ఆలయాల్లో 100 కియోస్క్‌లు ఏర్పాటు ఇప్పటికే చేస్తున్నారు. టచ్ స్క్రీన్ ఉండే వీటి ద్వారా భక్తులు దర్శనం, వివిధ సేవల టికెట్లు నేరుగా పొందవచ్చు. వీటిలో ఎన్ని టికెట్లు కావాలో నమోదు చేసి, డిజిటల్ చెల్లింపు చేస్తే వెంటనే టికెట్లు జారీ చేస్తుంది. ఉద్యోగుల అవసరం లేకుండానే నేరుగా టికెట్లు పొందేలా వీలు కల్పిస్తున్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద కరూర్ వైశ్యా బ్యాంకు 100 కియోస్క్‌లను ఉచితంగా సమకూర్చేందుకు ముందుకు వచ్చింది. వాటి ఇన్‌స్టలేషన్, నిర్వహణ అన్నీ కూడా ఆ బ్యాంకే చూసుకోనుంది.

# వైసీపీకి ప్రతిపక్ష హోదాపై స్పీకర్ !

**రాజ్యాంగ నిపుణులతో చర్చించినట్లు అయ్యన్న పాత్రుడు వెల్లడి**

**ప్రతిపక్ష హోదాకు అవసరమైన ఎమ్మెల్యేలు వైసీపీకి లేరని వ్యాఖ్య**

**నిర్ణీత సంఖ్య కన్నా తక్కువ సీట్లున్న పార్టీకి హోదా ఇవ్వడం కుదరదని వివరణ**



ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం పదకొండు సీట్లు మాత్రమే గెల్చుకున్న వైసీపీ ప్రతిపక్ష హోదా కోసం డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ప్రధాన ప్రతిపక్ష నేత హోదా కోసం జగన్ కోరుతుండడంపై స్పీకర్ అయ్యన్న పాత్రుడు తాజాగా స్పందించారు. జగన్ కోరికపై రాజ్యాంగ నిపుణులు, మిగతా రాష్ట్రాల స్పీకర్లతో తాను చర్చించానని తెలిపారు. అయితే, నిర్ణీత సంఖ్య కన్నా తక్కువ సీట్లకే పరిమితమైన వైసీపీకి రాజ్యాంగం ప్రకారం ప్రతిపక్ష హోదా ఇచ్చే అవకాశం లేదని వారు చెప్పినట్లు పేర్కొన్నారు.ప్రతిపక్ష హోదాకు అవసరమైన ఎమ్మెల్యేలు వైసీపీకి లేరని, అందుకే ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా ఇవ్వలేమని స్పీకర్ స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలంలోని కుతుకులూరులో మీడియా ప్రతినిధులతో ఈ వ్యాఖ్యలు చేశారు. కుతుకులూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం, అనపర్తిలో బీటీరోడ్డును స్థానిక ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో కలిసి స్పీకర్ అయ్యన్న పాత్రుడు ప్రారంభించారు.

***అసెంబ్లీకి రావాలంటూ జగన్ కు హితవు..***

బయట మైకులు పట్టుకుని మాట్లాడడం కాదు, అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ కు స్పీకర్ అయ్యన్న పాత్రుడు హితవు పలికారు. సభలో ఆయనకు మాట్లాడేందుకు అవకాశం ఇస్తామని చెప్పారు. జగన్ పాలనలో తనను అరెస్టు చేయించిన విషయం గుర్తుచేస్తూ.. "నన్ను అరెస్టు చేయించిన జగన్ కు ఇప్పుడు అధ్యక్షా అనడానికి నోరు రావడంలేదు. అందుకే ఆయన అసెంబ్లీకి రావడంలేదు. అసెంబ్లీ ఓ దేవాలయం. అందులో నేను పూజారిని మాత్రమే" అని స్పీకర్ అయ్యన్న పాత్రుడు పేర్కొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో పోలీసుల తీరుపై మాగంటి సునీత ఫైర్

**14న చూసుకుందామంటూ వార్నింగ్!**

**పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న సునీత**

**కాంగ్రెస్ నేతలు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపణ**

**తనను అడ్డుకోవడానికి మీరెవరంటూ పోలీసులపై సునీత ఆగ్రహం**

**14వ తేదీ తర్వాత చూసుకుందామని పోలీసులకు హెచ్చరిక**

**ఆశా వర్కర్లను ఉద్యోగాల పేరుతో బెదిరిస్తున్నారని విమర్శ**



జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు అధికార కాంగ్రెస్ పార్టీకి కొమ్ముకాస్తున్నారని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బోరబండలోని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించేందుకు వెళ్లిన తనను పోలీసులు అడ్డుకున్నారని సునీత ఆరోపించారు. "ఎమ్మెల్యే అభ్యర్థి అయితే ఏంటి?" అంటూ తనను బలవంతంగా వెనక్కి పంపారని, ఇది పోలీసుల పక్షపాత వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు.నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు, గూండాలు దౌర్జన్యాలకు పాల్పడుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని సునీత విమర్శించారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ నేతలు రౌడీయిజం చేస్తున్నారని అన్నారు. బోరబండలో ఓ రౌడీ షీటర్ ప్రజలను బెదిరిస్తున్నా పోలీసులు అతనికి సహకరిస్తున్నారని ఫైర్ అయ్యారు. తమకు ఓటు వేయక పోతే ఉద్యోగాలు తీసేస్తామని ఆశా వర్కర్లను బెదిరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.మరోవైపు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఎన్నికల కోడ్ ఉల్లంఘించి భారీ కాన్వాయ్‌తో సిద్దార్థ నగర్‌లోని బూత్-120 వద్ద పర్యటించారని, దీనిపై పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆమె నిలదీశారు. నిబంధనల ప్రకారం అందరూ పనిచేయాలని సూచించారు. "13వ తేదీ వరకు ఎంత ఇబ్బంది పెడతారో పెట్టండి. 14వ తేదీ తర్వాత చూసుకుందాం" అని పోలీసులకు ఆమె గట్టిగా హెచ్చరించారు. ఈ పరిణామాలతో జూబ్లీహిల్స్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## తాడిపత్రిలో వైసీపీ నేతపై దాడి.. విషమంగా ఆరోగ్య పరిస్థితి

**తాడిపత్రిలో వైసీపీ నేత ఆర్‌సీ ఓబుల్ రెడ్డిపై దాడి**

**గుర్తు తెలియని వ్యక్తుల దాడిలో తీవ్ర గాయాలు**

**అపస్మారక స్థితిలో ఆసుపత్రికి తరలింపు**



అనంతపురం జిల్లా తాడిపత్రిలో వైసీపీ నేత, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ ఆర్‌సీ ఓబుల్ రెడ్డిపై గుర్తు తెలియని దుండగులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఆయన తలకు, శరీరానికి తీవ్ర గాయాలవడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లోకి వెళితే, తాడిపత్రిలోని ఐశ్వర్య విల్లాస్ బైపాస్ సమీపంలో ఓబుల్ రెడ్డిపై కొందరు వ్యక్తులు దాడి చేశారు. తీవ్ర గాయాలతో పడి ఉన్న ఆయనను గమనించిన స్థానికులు వెంటనే తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హుటాహుటిన ఆసుపత్రికి చేరుకుని ఓబుల్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.అయితే, ఆయన పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. తాడిపత్రిలో రాజకీయ సున్నితత్వం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఈ దాడి వెనుక రాజకీయ కక్షలు ఉన్నాయా? లేక వ్యక్తిగత కారణాలతో జరిగిందా? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ ఘటన తాడిపత్రిలో మరోసారి ఉద్రిక్తతకు దారితీసింది.


## ఢిల్లీ పేలుళ్లకు 3 గంటల ముందే 'రెడ్డిట్'లో పోస్ట్

**వైరల్ అవుతున్న విద్యార్థి హెచ్చరిక!**

**ఎర్రకోట వద్ద భారీ భద్రతపై అనుమానం వ్యక్తం చేసిన 12వ తరగతి విద్యార్థి**

**సాయంత్రం 4 గంటలకు పోస్ట్**

**రాత్రి 7 గంటల సమయంలో కారు బాంబు పేలుడు**



దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుళ్లకు సంబంధించి ఒక ఆసక్తికరమైన విషయం వెలుగులోకి వచ్చింది. ఈ దుర్ఘటన జరగడానికి కేవలం మూడు గంటల ముందు, ఒక విద్యార్థి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'రెడ్డిట్'లో పెట్టిన పోస్ట్ ఇప్పుడు తీవ్ర కలకలం రేపుతోంది. పేలుడు జరిగిన ప్రదేశంలో భారీగా భద్రతా బలగాలను మోహరించడంపై అతను ఆ పోస్ట్‌లో అనుమానం వ్యక్తం చేశాడు.12వ తరగతి చదువుతున్నట్లు చెప్పుకున్న ఒక విద్యార్థి, సాయంత్రం 4 గంటల సమయంలో 'ఢిల్లీలో ఏదో జరగబోతోందా?' అంటూ ఒక పోస్ట్ పెట్టాడు. "నేను ఇప్పుడే స్కూల్ నుంచి వచ్చాను. ఎర్రకోట, మెట్రో స్టేషన్ల వద్ద ఎన్నడూ లేనంతగా పోలీసులు, ఆర్మీ సిబ్బంది, మీడియా కనిపిస్తున్నారు. మెట్రోలో ప్రయాణిస్తున్నప్పుడు కూడా నేను ఇంతమంది సైన్యాన్ని ఎప్పుడూ చూడలేదు. అసలు ఇక్కడ ఏం జరుగుతోంది?" అని ఆ పోస్ట్‌లో ప్రశ్నించాడు.రాత్రి 7 గంటల ప్రాంతంలో అదే ప్రాంతంలో పేలుడు పదార్థాలతో నింపిన హ్యుందాయ్ ఐ20 కారు పేలిపోయిన తర్వాత, ఈ పోస్ట్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యింది. ఘటన జరగబోయే ప్రదేశం, సమయం విషయంలో ఇంత కచ్చితంగా అనుమానం వ్యక్తం చేయడంపై నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. "అతను మనల్ని తెలియకుండానే హెచ్చరించడానికి ప్రయత్నించాడు", "అతను కచ్చితమైన ఆలోచనతో భవిష్యత్తును అంచనా వేశాడు" అంటూ కామెంట్లు పెడుతున్నారు.సుభాష్ మార్గ్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద జరిగిన ఈ పేలుడు ఘటనపై ఉగ్రవాద కోణంలో విచారణ జరుగుతోంది. అదే రోజు ఫరీదాబాద్‌లో ఉగ్రవాద ముఠాకు చెందిన పలువురు అనుమానితులను అరెస్ట్ చేసిన నేపథ్యంలో ఈ కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు.కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ ఘటనపై స్పందిస్తూ, అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు జరుపుతామని తెలిపారు. ఎన్ఐఏ, ఇంటెలిజెన్స్ బ్యూరో, ఢిల్లీ పోలీసుల యాంటీ-టెర్రర్ విభాగం సంయుక్తంగా ఈ కేసును విచారిస్తున్నాయని ఆయన ధృవీకరించారు.

## కొత్త ఇల్లు కడితే రూ.లక్ష ఇవ్వాలట

**అంత ఇవ్వలేనన్న వ్యక్తిపై హిజ్రాల దాడి**

**చీర్యాల్ లో ఓ కుటుంబంపై కర్రలు, రాళ్లతో దాడి చేసిన హిజ్రాలు**

**కొత్తగా కట్టుకున్న ఇంటి ఆవరణలో విధ్వంసం**

**అడిగినంతా ఇవ్వలేదని మూడు ఆటోల్లో వచ్చి మరీ దాష్టీకం**



కొత్త ఇల్లు కట్టుకుని గృహప్రవేశం చేసిన ఓ కుటుంబంపై హిజ్రాలు దాడి చేశారు. రూ. లక్ష ఇవ్వాలని డిమాండ్ చేయగా అంత ఇవ్వలేనడంతో అసభ్యంగా దూషించారు. అక్కడి నుంచి వెళ్లిపోయిన హిజ్రాలు.. ఆ తర్వాత మూడు ఆటోల్లో గుంపుగా వచ్చి కర్రలు, రాళ్లతో దాడి చేశారు. కీసర మండలం చీర్యాల్ లో చోటుచేసుకుందీ దారుణం. వివరాల్లోకి వెళితే..చీర్యాల్ లోని శ్రీబాలాజీ ఎన్క్లేవ్ లో ప్రమిదల సదానందం ఇటీవల కొత్త ఇల్లు కట్టుకున్నాడు. బంధుమిత్రుల సమక్షంలో సంతోషంగా గృహప్రవేశం నిర్వహించాడు. ఈ క్రమంలో ఆదివారం ఇంటిముందు సదానందం పనిచేస్తుండగా ఇద్దరు హిజ్రాలు వచ్చారు. కొత్త ఇల్లు కట్టుకున్నారు మాకు డబ్బులు ఇవ్వాలని అడిగారు. ఎంతోకొంత ఇచ్చి పంపిద్దామని చూస్తే ఒప్పుకోలేదు. రూ.లక్ష ఇవ్వాలని పట్టుబట్టారు. అంత మొత్తం ఇవ్వలేనని సదానదం చెప్పడంతో అసభ్యంగా దూషించి వెళ్లిపోయారు.కాసేపటి తర్వాత మూడు ఆటోల్లో 15 మంది హిజ్రాలు వచ్చారు. ఇంటి గేటును ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారు. శబ్దం విని బయటకు వచ్చిన సదానందంతో పాటు ఆయన కుటుంబ సభ్యులపై కర్రలు, రాళ్లతో దాడి చేశారు. ఈ గొడవను గమనించి చుట్టుపక్కల వారు రావడంతో హిజ్రాలు పారిపోయారు. హిజ్రాల దాడిలో గాయపడ్డ సదానందం ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నాక కీసర పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హిజ్రాల ఆగడాలు హెచ్చుమీరుతున్నాయని, పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## అమరావతిలో ఎం.ఎస్.కె ప్రసాద్ అంతర్జాతీయ క్రికెట్ అకాడమీ

**ఘనంగా భూమి పూజ**

**12 ఎకరాల విస్తీర్ణంలో ప్రపంచ స్థాయి వసతులతో నిర్మాణం**

**భూమి పూజ కార్యక్రమం నిర్వహించిన ఎం.ఎస్.కె ప్రసాద్**

**స్థానిక క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడమే లక్ష్యం**



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా కీలక అడుగు పడింది. భారత క్రికెట్ జట్టు మాజీ చీఫ్ సెలెక్టర్ ఎం.ఎస్.కె ప్రసాద్ ఆధ్వర్యంలో "ఎం.ఎస్.కె ప్రసాద్ ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీ" ఏర్పాటు కానుంది. ఈ అకాడమీ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎం.ఎస్.కె ప్రసాద్, ఆయన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. మెరికల్లాంటి యువ క్రీడాకారులను దేశానికి అందించడమే లక్ష్యంగా ఈ అకాడమీని స్థాపిస్తున్నట్లు ఆయన తెలిపారు.సుమారు 12 ఎకరాల విస్తీర్ణంలో ఈ క్రికెట్ అకాడమీని నిర్మించనున్నారు. ఇది కేవలం శిక్షణా కేంద్రంగానే కాకుండా, ప్రపంచ స్థాయి క్రీడా సముదాయంగా అభివృద్ధి చెందుతుందని ఎం.ఎస్.కె వివరించారు. ఈ అకాడమీ ద్వారా స్థానిక క్రికెటర్లలోని ప్రతిభను పెంపొందించి, వారికి మెరుగైన అవకాశాలు కల్పిస్తామని ఆయన అన్నారు. అమరావతిలో క్రీడా మౌలిక వసతులను బలోపేతం చేయడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సమీకృత క్యాంపస్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రికెట్ మైదానం, పలు ప్రాక్టీస్ గ్రౌండ్లు, అత్యాధునిక శిక్షణా సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు. ఆధునిక నెట్లతో పాటు క్రీడాకారుల సామర్థ్యాన్ని విశ్లేషించే సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఇండోర్ ట్రైనింగ్ అకాడమీ దీని ప్రత్యేకత. క్రీడలతో పాటు విద్యకు ప్రాధాన్యతనిస్తూ అంతర్జాతీయ రెసిడెన్షియల్ పాఠశాలను కూడా ఇక్కడే నిర్మించనున్నారు. క్రీడాకారులు, సందర్శక జట్ల కోసం ప్రత్యేక వసతి, హాస్టల్ సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. స్థానిక టోర్నమెంట్ల నిర్వహణ కోసం మినీ క్రికెట్ స్టేడియం, అత్యాధునిక జిమ్, ఫిజియోథెరపీ, పునరావాస కేంద్రాలు కూడా ఈ ప్రాజెక్టులో భాగంగా ఉంటాయి. అమరావతిని ఒక క్రీడా కేంద్రంగా మార్చే లక్ష్యంతో సీఆర్డీఏ ఈ అకాడమీ నిర్మాణానికి పూర్తి సహాయ సహకారాలను అందిస్తోంది.

# కాలానికి ఎదురెళ్లి పోరాడే వజ్రం

## సామాజిక సేవే లక్ష్యంగా దూసుకెళ్తున్న పావని



**హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్:**

చిన్నతనములో కొనసాగిన జీవితం...ఆనందాన్నీ కాలం పరీక్షిస్తుంది,మనిషిలో ఉన్న కసి, పట్టుదలను బయటకు తెచ్చేలా చేస్తుంది, భయపడి ఆగిపోతే జీవితం అక్కడితో ఆగిపోతుంది.. సర్దుకుపోయేలా చేస్తుంది.. కానీ కాలానికి ఎదురెళ్ళి పోరాడితే వజ్రంలా మెరుస్తుంది..అలాంటి వజ్రమే కుమారి ఓ.పావని. హై స్కూల్ స్థాయి విద్యను అభ్యసించే సమయంలోనే తండ్రి కుటుంబాన్ని వదిలేసిన తండ్రి, క్లిష్ట పరిస్థితులు ఉన్న సమయంలో తల్లి ఉద్యోగానికి దూరం అయింది, కుటుంబ పరిస్థితితులు అన్ని తారుమారు,ఆర్థిక పరిస్థితులు చిన్నాభిన్నం అయ్యాయి, చదువు సాగుతుందో లేదో తెలియని పరిస్థితి, ఒక్కపూట ఆకలి తీరితే రెండుపూటలు పస్తులు ఉండాల్సిన పరిస్థితులు, బ్రెడ్ తో ఆకలి తీర్చుకున్న సందర్భాలు ఎన్నో, గుడిలో ఐదు రూపాయలకు పులిహొర కొనుకొని ఆకలి తీర్చుకున్న సందర్భాలు ఎన్నెనో. అలాంటి స్థితులలో నిబ్బరంతో విద్యను అభ్యసిస్తూ సాగుతున్న ప్రయాణం,డాక్టర్ కావాలి అనే చిన్నపట్టి కల కలలానే మిగిలిపోయింది,ఎం సెట్ లో మంచి ఫలితాలను సాధించి మెడికల్ సెట్ సంపాదించింది, కానీ అడ్మిషన్, ఇతర రుసుములు చెల్లించే పరిస్థితి లేక డాక్టర్ చదువుకు దూరం అయింది. కల చెదిరింది అని ఆగిపోలేదు, అయినా కూడా చదువులో రాణిస్తూ ఎం ఫార్మసీ పూర్తి చేసింది, కష్టంలో కూడా చెదరని ఆత్మవిశ్వాసంతోనే చదువుతూనే ట్యూషన్స్ చెప్తూ, చదువు పూర్తి అయ్యాక ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ సంపాదించే సంపాదనలో సగం సమాజ సేవలో తనవంతుగా సహాయం చేస్తూ వస్తుంది, సమాజంలో ఆకలితో ఎవ్వరు ఉండొద్దు అనే ఆలోచన కలగడంతో స్కై ఫౌండేషన్ లో వైస్ ప్రెసిడెంట్ గా చేరి తన వంతుగా నిరంతరం సేవలు కొనసాగిస్తూ వస్తుంది.

ఆకలితో ఎవ్వరు పస్తులు ఉండొద్దు అనే ఆలోచనతో నేను స్కై ఫౌండేషన్ లో వైస్ ప్రెసిడెంట్ గా చేరి నా వంతుగా నేను సహాయకార్యక్రమాలు చేస్తున్నాను. మొట్టమొదటగా అన్నదాన కార్యక్రమం మా ఇంట్లో నుంచే ప్రారంభం చేశాను, ఆకలి తీర్చేటప్పుడు వాళ్ళ కళ్ళలో వచ్చిన ఆనంద బాష్పాలు, వాళ్ళ మాటలు నన్ను మరింత దృఢ సంకల్పానికి నాంది పలికేలా చేసాయి, ప్రారంభం నుంచి నేటి వరకు నిరంతరం సేవలు కొనసాగిస్తూనే ఉన్నాను. ఆడపిల్లలు ఎవ్వరూ కూడా ఎలాంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా ఆత్మస్థయిర్యం విడిచిపెట్టవద్దు. కష్టాలు రావొచ్చు, కానీ పోరాడితే ఎలాంటి కష్టమైన ఓడిపోవలసిందే.

ఓ.పావని,
వైస్ ప్రెసిడెంట్, స్కై ఫౌండేషన్.






### టీ, కాఫీలకు బెస్ట్ ఆల్టర్నేటివ్..! ఉదయాన్నే ఈ నీళ్లు తాగండి..

## కిడ్నీల ఆరోగ్యం నుండి మెరిసే చర్మం వరకు..!

ప్రతి ఉదయం టీ లేదా కాఫీతో రోజును మొదలుపెట్టడం చాలా మందికి అలవాటు. అయితే ఆరోగ్యాన్ని మెరుగుపర్చాలంటే వాటికి బదులుగా కొబ్బరి నీళ్లు ఒక మంచి ఎంపిక. ఖాళీ కడుపుతో కొబ్బరి నీరు తాగడం వల్ల శరీరానికి బలం, శక్తి కలుగుతుంది. ఇందులో ఉండే సహజ ఎలక్ట్రోలైట్లు శక్తిని ఇస్తూ రోజంతా ఉత్సాహంగా ఉండటానికి దోహదపడతాయి. ఉదయం 6 నుంచి 8 గంటల మధ్య శరీరం ఎక్కువగా జీర్ణ ఎంజైమ్ లు ఉత్పత్తి చేస్తుంది. ఈ సమయంలో తీసుకునే పోషకాలు శరీరానికి మూడు రెట్లు మెరుగుగా గ్రహించబడతాయని ఆరోగ్య నిపుణుల అభిప్రాయం. అందుకే ఈ సమయంలో ఖాళీ కడుపుతో కొబ్బరి నీరు తాగడం వల్ల దాని ప్రయోజనాలు మరింతగా పెరుగుతాయి.

### పేగుల శుభ్రత

కొబ్బరి నీటిలో ఉండే లారిక్ యాసిడ్ వంటి మధ్యస్థ శ్రేణి కొవ్వులు శరీరంలో హానికరమైన బ్యాక్టీరియాను తొలగించడంలో సహాయపడతాయి. ఇవి యాంటీబ్యాక్టీరియల్ లక్షణాలను కలిగి



ఉండటంతో ఖాళీ కడుపుతో తీసుకుంటే శుభ్రతకు సహకరిస్తుంది.

### కిడ్నీ ఆరోగ్యం

మానవ శరీరంలో మూత్రపిండాలు రాత్రిపూట టాక్సిన్లను ఫిల్టర్ చేస్తూ పనిచేస్తుంటాయి. ఉదయాన్నే ఈ ప్రక్రియను సమర్థంగా కొనసాగించేందుకు అవసరమైన ఖనిజాలు.. ముఖ్యంగా పొటాషియం, మెగ్నీషియం కొబ్బరి నీటిలో సమృద్ధిగా లభిస్తాయి. ఈ డ్రింక్ లో పొటాషియం-సోడియం నిష్పత్తి 25:1 ఉండటం వల్ల మూత్రపిండాల ఆరోగ్యానికి చాలా మంచిది.

### స్థిరమైన శక్తి

కెఫిన్ వంటి ఉత్తేజపరిచే పదార్థాల బదులుగా.. కొబ్బరి నీటిలో ఉండే గ్లూకోజ్, ఫ్రక్టోజ్, సుక్రోజ్ వంటివి నెమ్మదిగా శరీరంలోకి కలుస్తాయి. దీని వల్ల శక్తి స్థాయిలు స్థిరంగా కొనసాగుతాయి. ఇది ఎటువంటి వణుకు లేకుండా ప్రశాంతమైన శక్తిని అందిస్తుంది.

### యవ్వనమైన చర్మం

కొబ్బరి నీటిలో ఉండే సైటోకినిన్స్ అనే సహజ మొక్కల హార్మోన్లు కణాల పునరుత్పత్తికి సహాయపడతాయి. ఇవి వృద్ధాప్య సంకేతాలను తగ్గిస్తూ.. కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తాయి. ఇది చర్మం రంగును మెరుగుపరచడంలో, మృదువుగా మార్చడంలో సహాయపడుతుంది.


## ఆకస్మిక మరణాలకు.. కొవిడ్ టీకాలకు సంబంధం లేదు.. స్పష్టం చేసిన ఐసీఎంఆర్-ఎయిమ్స్ స్టడీ..!




ఆకస్మిక మరణాలకు కరోనా టీకాలకు సంబంధం లేదని ఓ అధ్యయనంలో తేలింది. భారత వైద్య పరిశోధనా మండలి ఎయిమ్స్ సంయుక్తంగా అధ్యయనం నిర్వహించాయి. కరోనా మహమ్మారి తర్వాత 40 ఏళ్లలోపు వయస్సు ఉన్నవారిలో హార్ట్ ఎటాక్స్ పెరిగినట్లు నివేదికలు పేర్కొన్నాయి. వీటికి వ్యాక్సిన్ కారణం కాదని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఇటీవల కర్ణాటకలోని హాసన్ జిల్లాలో పలువురు యువకులు హార్ట్ ఎటాక్‌తో మరణించారు. దీనిపై సీఎం సిద్ధరామయ్య స్పందిస్తూ.. కొవిడ్ టీకాను వేగంగా పంపిణీ చేయడం వల్లే అది జరుగుతుండొచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. చెస్ట్‌లో నొప్పి, ఊపిరాడకపోవడం వంటి లక్షణాలుంటే నిర్లక్ష్యం చేయకుండా దగ్గరలోని ఆసుపత్రిలో వెంటనే పరీక్షలు చేయించుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అయితే, కేంద్ర ప్రభుత్వం మాత్రం ఈ ఆరోపణలను ఖండించింది.ఐసీఎంఆర్, నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ సంస్థలు జరిపిన సమగ్ర అధ్యయనంలో టీకా కారణంగా మరణాలు సంభవించలేదని తేలింది. ఈ అధ్యయనం 2023 మే నుంచి ఆగస్ట్ వరకు 19 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 47 ప్రాంతీయ ఆసుపత్రుల సహాయంతో 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగినవారిపై అధ్యయనం జరిపారు. ఇందులో 2021 అక్టోబర్ నుంచి 2023 మార్చి మధ్య అకస్మాత్తుగా సంభవించిన మరణాలను విశ్లేషించారు. ఈ అధ్యయనంలో హార్ట్ ఎటాక్ కేసుల పెరుగుదలకు జన్యుపరమైన మార్పులు ప్రధాన కారణంగా గుర్తించారు. ప్రస్తుతం ఎయిమ్స్, ఐసీఎంఆర్ నిధులతో పూర్తిస్థాయిలో అధ్యయనం చేపట్టింది. నివేదిక పూర్తి అయిన తర్వాత నిధులతో మరో పూర్తిస్థాయి అధ్యయనాన్ని చేపట్టింది. ఆకస్మిక మరణాలకు కరోనా టీకా కాకుండా జీవనశైలి, మునుపటి ఆరోగ్య సమస్యలు, కోవిడ్ ఇన్ఫెక్షన్ తర్వాత ఏర్పడిన సమస్యలు, జెనెటిక్ కారణాలు వంటి అనేక అంశాలు కారణమని వివరించారు. కరోనా టీకా మానవాళిని మహమ్మారి నుంచి రక్షించిందని, అనవసరమైన ఆరోపణలు ప్రజల్లో భయాన్ని, టీకాపై నమ్మకాన్ని దెబ్బతీయవచ్చని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. హాసన్ జిల్లాలో గత నెలలో 20 మందికిపైగా అకస్మాత్తుగా మరణించినట్లు కర్ణాటక ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కానీ, ఈ ఘటనలకు సంబంధించి తగిన పరిశోధనలు జరుగుతున్నాయని కేంద్రం తెలిపింది.

## చిన్న రక్త పరీక్షతో క్యాన్సర్ ముప్పు గుర్తింపు!

### పిరితిత్తులు, ప్యాంక్రియాటిక్ క్యాన్సర్లలో గణనీయమైన ప్రయోజనం



క్యాన్సర్ మహమ్మారి ప్రపంచాన్ని భయపెడుతున్న తరుణంలో వైద్య రంగంలో ఒక కీలక ముందడుగు పడింది. లక్షణాలు బయటపడక ముందే, కేవలం ఒక సాధారణ రక్త పరీక్ష ద్వారా అనేక రకాల క్యాన్సర్లను గుర్తించే సరికొత్త విధానం అందుబాటులోకి రాబోతోంది. ఈ 'లిక్విడ్ బయాప్సీ' పరీక్ష ద్వారా, వ్యాధి ముదిరిపోయి నాలుగో దశకు చేరే కేసులను గణనీయంగా తగ్గించవచ్చని ఓ సంచలనాత్మక అధ్యయనం వెల్లడించింది.ప్రపంచ ఆరోగ్య సంస్థ (%ఔనూ%) ప్రకారం, ఒక్క 2020లోనే క్యాన్సర్ వల్ల కోటి మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం రొమ్ము, గర్భాశయ, పెద్దప్రేగు వంటి కొన్ని క్యాన్సర్లకు మాత్రమే ప్రామాణిక స్క్రీనింగ్ పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. దీంతో 70 శాతానికి పైగా కొత్త క్యాన్సర్ కేసులు, లక్షణాలు ముదిరిన తర్వాతే బయటపడుతున్నాయి. దీనివల్ల చికిత్స కష్టమవడమే కాకుండా, ప్రాణనష్టం ఎక్కువగా జరుగుతోంది. అయితే, ఒకే రక్త నమూనాతో పదుల సంఖ్యలో క్యాన్సర్లను గుర్తించే 'మల్టీ-క్యాన్సర్ ఎర్లీ డిటెక్షన్' టెస్టులు ఈ పరిస్థితిని మార్చగలవని పరిశోధకులు చెబుతున్నారు.అమెరికన్ క్యాన్సర్ సొసైటీకి చెందిన 'క్యాన్సర్' అనే ప్రముఖ జర్నల్‌లో ఈ అధ్యయన వివరాలు ప్రచురితమయ్యాయి. 'క్యాన్సర్‌గార్డ్' అనే టెస్టును ఉపయోగించి ఈ పరిశోధన చేశారు. అమెరికాలోని 50 లక్షల మంది ప్రజల (50-84 ఏళ్ల మధ్య వయస్కులు) 10 సంవత్సరాల డేటాను తీసుకుని, వారికి ఏటా ఈ రక్త పరీక్ష చేస్తే ఎలాంటి ఫలితాలు వస్తాయో సిమ్యులేషన్ ద్వారా అంచనా వేశారు.ఈ సిమ్యులేషన్ ఫలితాలు అద్భుతమైన మార్పును సూచించాయి. ఈ పరీక్ష వల్ల క్యాన్సర్‌ను మొదటి దశలో గుర్తించే కేసులు 10%, రెండో దశలో 20%, మూడో దశలో 30% పెరిగాయి. అత్యంత కీలకమైన విషయం ఏమిటంటే, వ్యాధి ముదిరిపోయి చివరిదైన నాలుగో దశలో బయటపడే కేసులు ఏకంగా 45% తగ్గాయి. ముఖ్యంగా ఊపిరితిత్తులు, పెద్దప్రేగు, ప్యాంక్రియాటిక్ క్యాన్సర్లలో నాలుగో దశ కేసులు గణనీయంగా తగ్గుతాయని తేలింది.ఈ అధ్యయనానికి నాయకత్వం వహించిన హార్వర్డ్ మెడికల్ స్కూల్‌కు చెందిన డాక్టర్ జగ్‌ప్రీత్ చట్వాల్ మాట్లాడుతూ.. "ఈ మల్టీ-క్యాన్సర్ రక్త పరీక్షలు క్యాన్సర్ నియంత్రణలో ఒక గేమ్-ఛేంజర్‌గా నిలుస్తాయి. వ్యాధి శరీరమంతా వ్యాపించక ముందే గుర్తించడం వల్ల ప్రాణాలను కాపాడటంతో పాటు, రోగులపై వ్యక్తిగత, ఆర్థిక భారం కూడా తగ్గుతుంది" అని వివరించారు.

# హీరో సరికొత్త ఈ-స్కూటర్.. ప్రారంభ ధర రూ.1.02 లక్షలు



ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ హీరో మరో ఎలక్ట్రిక్ స్కూటర్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. విదా వీఎక్స్2 పేరుతో ఈ స్కూటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది 3.4 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన ఈ స్కూటర్ ప్రారంభ ధర రూ.1.02 లక్షలుగా నిర్ణయించింది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ హీరో మరో ఎలక్ట్రిక్ స్కూటర్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. విదా వీఎక్స్2 పేరుతో ఈ స్కూటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది 3.4 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన ఈ స్కూటర్ ప్రారంభ ధర రూ.1.02 లక్షలుగా నిర్ణయించింది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. పాత మాడల్‌తో పోలిస్తే ఈ నయా మాడల్‌లో నూతన ఫీచర్స్, మూడు బ్యాటరీ ఫీచర్స్ 2.2 కిలోవాట్లు, 3.4 కిలోవాట్ల బ్యాటరీ సామర్థ్యంతో తీర్చిదిద్దింది3.4 కిలోవాట్ల బ్యాటరీ కలిగివున్న ఈ స్కూటర్ సింగిల్ చార్జింగ్‌తో 100 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. గంటకు 70 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోయే ఈ స్కూటర్ బ్యాటరీలు రెండు పూర్తిస్థాయి రీచార్జింగ్ కావాలంటే గరిష్ఠంగా ఏడు గంటలు పట్టనున్నది. 4.3 ఇంచుల డిజిటల్ డిస్‌ప్లే కలిగిన ఈ స్కూటర్‌ను స్మార్ట్‌ఫోన్‌తో కనెక్టింగ్ చేసుకోవచ్చును. దీంతో నావిగేషన్, మ్యూజిక్ కంట్రోల్, కాల్ అలర్ట్ కూడా కనిపించనున్నది.

# నెఫ్రోకేర్ ఐపీవోకి గ్రీన్‌సిగ్నల్




రాష్ట్రానికి చెందిన ప్రముఖ డయాలసిస్ సేవల సంస్థ నెఫ్రోకేర్ హెల్త్ సర్వీసెస్ ఐపీవోకి మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. తాజా ఈక్విటీ షేర్లను జారీచేయడంతో రూ.353.4 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో ప్రమోటర్లు, వాటాదారులకు సంబంధించి మరో 1.2 కోట్ల షేర్లను బహిరంగ మార్కెట్లో విక్రయించనున్నది. రాష్ట్రానికి చెందిన ప్రముఖ డయాలసిస్ సేవల సంస్థ నెఫ్రోకేర్ హెల్త్ సర్వీసెస్ ఐపీవోకి మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. తాజా ఈక్విటీ షేర్లను జారీచేయడంతో రూ.353.4 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో ప్రమోటర్లు, వాటాదారులకు సంబంధించి మరో 1.2 కోట్ల షేర్లను బహిరంగ మార్కెట్లో విక్రయించనున్నది. షేర్హ హోల్డర్లలో భాగంగా ఇండియా ప్రైవేట్ ఈక్విటీ లిమిటెడ్, ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్, 360 వన్ స్పెషల్ ఆపర్చ్యూనిటీ ఫండ్-సిరీస్ 9, 360 వన్ స్పెషల్ ఆపర్చ్యూనిటీ ఫండ్-సిరీస్ 11 కంపెనీలకు చెందిన షేర్లను విక్రయించనున్నారు.ఐపీవో ద్వారా సేకరించిన నిధుల్లో రూ.129.1 కోట్లను నూతన డయాలసిస్ క్లీనిక్స్‌ను నెలకొల్పడానికి, మరో రూ.136 కోట్లను రుణాలను తిరిగి చెల్లించడానికి వినియోగించనున్నట్టు ప్రకటించింది. 2009లో ప్రారంభమైన సంస్థ తన డయాలసిస్ సెంటర్లను 500కి విస్తరించింది. దీంతోపాటు కమర్షియల్ రెన్యూబుల్ ఎలక్ట్రిసిటీ ప్రొవైడర్ క్లీన్ మ్యాక్స్ ఎన్విరో ఎనర్జీ సొల్యూషన్స్ ఐపీవోకి కూడా అనుమతినిచ్చింది. ఈ రెండు సంస్థలు కలిసి రూ.5,553 కోట్ల వరకు నిధులు సమీరించనున్నాయి. దీంట్లో క్లీన్ మ్యాక్స్ రూ.5,200 కోట్ల నిధులు సమీకరించనున్నది. ఇరు సంస్థలో ఆగస్టు నెలలో ఐపీవోకి దరఖాస్తు చేసుకోగా..అక్టోబర్ 30 నుంచి నవంబర్ 4 వరకు పరిశీలించిన తర్వాత చివరగా అనుమతినిచ్చింది.

# మరోసారి షాక్ ఇచ్చిన బంగారం, వెండి.. ఒకేరోజు భారీగా పెరిగిన ధరలు



పసిడి ధరలు కొనుగోలుదారులకు మరోసారి షాక్ ఇచ్చాయి. సోమవారం మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు భారీగా పరిగాయి. 24 క్యారెట్ల పసిడి రూ.1,300 పెరిగి తులానికి రూ.1,25,900 కి చేరుకుంది. వెండి సైతం రూ.2,460 పెరిగి కిలో ధర రూ.1,55,760కి చేరుకుంది. ని పసిడి ధరలు కొనుగోలుదారులకు మరోసారి షాక్ ఇచ్చాయి. సోమవారం మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు భారీగా పరిగాయి. 24 క్యారెట్ల పసిడి రూ.1,300 పెరిగి తులానికి రూ.1,25,900 కి చేరుకుంది. వెండి సైతం రూ.2,460 పెరిగి కిలో ధర రూ.1,55,760కి చేరుకుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. అమెరికా ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉండటం, డాలర్ విలువ పడిపోవడంతో పెట్టుబడిదారులు బంగారాన్ని సురక్షితమైన పెట్టుబడిగా భావిస్తున్నారు. దాంతో డిమాండ్ పెరిగి ధరలు పెరిగాయి. ఫెడరల్ రిజర్వ్ తదుపరి సమావేశంలో వడ్డీ రేటు తగ్గుతుందనే అంచనాలు కూడా బంగారం ధరలకు మద్దతు ఇస్తున్నాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్‌లోని కమోడిటీ నిపుణుడు సౌమిల్ గాంధీ తెలిపారు.వెండి ధరలు కూడా గణనీయంగా పెరిగాయి. శుక్రవారం కిలోకు రూ.1,53,300 నుంచి ప్రస్తుతం రూ.1,55,760కి చేరాయి. ప్రపంచ మార్కెట్లో బంగారం, వెండి ధరలు కూడా పెరిగాయి. స్పాట్ బంగారం ఔన్సుకు దాదాపు 2.08శాతం పెరిగి 4,082.84 డాలర్లకు చేరుకోగా.. వెండి 3.30శాతం పెరిగి ఔన్సుకు 49.93 డాలర్లకు పెరిగింది. ఎల్‌కేపీ సెక్యూరిటీస్‌కు చెందిన జతిన్ త్రివేది ప్రకారం.. అమెరికా ప్రభుత్వం తిరిగి ప్రారంభమయ్యే సంకేతాలు, బలహీనమైన డాలర్ కారణంగా బులియన్ మార్కెట్లో సానుకూల సెంటిమెంట్ బలపడింది.

# ఎల్ఐసీ లాభం 10 వేల కోట్లు.. క్యూ2లో 32 శాతం పెరిగిన ప్రాఫిట్




దేశీయ బీమా దిగ్గజం ఎల్ఐసీ అదరగొట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను సంస్థ రూ.10,053 కోట్ల నికర లాభాన్ని గడించింది. కిందటి ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.7,621 కోట్ల లాభంతో పోలిస్తే 32 శాతం వృద్ధిని కనబరిచింది. దేశీయ బీమా దిగ్గజం ఎల్ఐసీ అదరగొట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను సంస్థ రూ.10,053 కోట్ల నికర లాభాన్ని గడించింది. కిందటి ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.7,621 కోట్ల లాభంతో పోలిస్తే 32 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.2,29,620 కోట్ల నుంచి రూ.2,39,614 కోట్లకు ఎగబాకినట్టు బీఎస్‌ఈకి సమాచారం అందించింది.

# పెట్టుబడి ఉంచుదామా.. తీద్దామా.. డైలమాలో మదుపరులు




రికార్డుస్థాయిలో పరుగులు పెడుతున్న బంగారం ధరలు.. గోల్డ్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కున్న రకరకాల మార్గాలపట్ల మదుపరులను విపరీతంగా ఆకర్షింపజేస్తున్నాయి. ఈ క్రమంలోనే కొందరు సంప్రదాయ పద్ధతిలో పసిడి నాణేలు, బిస్కట్లు, కడ్డీలు, నగలను కొనేందుకు ఇష్టపడుతుంటే.. ఇంకొందరు డిజిటల్ గోల్డ్, గోల్డ్ ఈటీఎఫ్‌లు, బాండ్లు, సెక్యూరిటీలవైపు మొగ్గు చూపుతున్నారు. డిజిటల్ గోల్డ్‌పై సెబీ సూచనలపట్ల నిపుణుల మాటేంటి రికార్డుస్థాయిలో పరుగులు పెడుతున్న బంగారం ధరలు.. గోల్డ్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కున్న రకరకాల మార్గాలపట్ల మదుపరులను విపరీతంగా ఆకర్షింపజేస్తున్నాయి. ఈ క్రమంలోనే కొందరు సంప్రదాయ పద్ధతిలో పసిడి నాణేలు, బిస్కట్లు, కడ్డీలు, నగలను కొనేందుకు ఇష్టపడుతుంటే.. ఇంకొందరు డిజిటల్ గోల్డ్, గోల్డ్ ఈటీఎఫ్‌లు, బాండ్లు, సెక్యూరిటీలవైపు మొగ్గు చూపుతున్నారు. అయితే ఇదే అదనుగా ఇటీవలికాలంలో డిజిటల్ మోసాలు విజృంభిస్తున్నాయి. దీంతో సెక్యూరిటీస్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) అప్రమత్తమైంది. తాజాగా డిజిటల్ గోల్డ్ సాధనాల్లో పెట్టుబడుల గురించి మదుపరులను హెచ్చరించిన విషయమూ తెలిసిందే. సెబీ నియంత్రిత గోల్డ్ ప్రొడక్ట్స్‌తో పోల్చితే అవి భిన్నంగా ఉంటాయని, అమాయక ఇన్వెస్టర్లు రిస్క్‌లోపడే ప్రమాదం ఉందన్న సంగతీ విదితమే. దీంతో ఇన్నాళ్లూ డిజిటల్ గోల్డ్‌పై పెట్టుబడులు పెడుతూ వచ్చిన వారంతా ఇప్పుడు ఒక్కసారిగా భయాందోళనలకు గురవుతున్నారు. ఈ క్రమంలోనే తమ పెట్టుబడులను అలాగే ఉంచుదామా లేక వెనక్కి తీసుకుందామా అన్న డైలమాలో పడిపోయారు.ఇంతకీ సెబీ ఏం చెప్పింది?'కొన్ని డిజిటల్, ఆన్‌లైన్ వేదికలు ఆయా 'డిజిటల్ గోల్డ్/ఈ-గోల్డ్ ప్రొడక్ట్స్'లో పెట్టుబడులు పెట్టేలా ఇన్వెస్టర్లకు రకరకాల ఆఫర్లు చేస్తున్నట్టు మా దృష్టికి వచ్చింది. భౌతిక బంగారంలో పెట్టుబడి కోసం ప్రత్యామ్నాయంగా ఉన్నదే ఈ డిజిటల్ గోల్డ్. అయితే మా నియంత్రణలో ఉన్న గోల్డ్ ప్రొడక్ట్స్‌తో చూస్తే.. సదరు డిజిటల్ గోల్డ్ ప్రొడక్ట్స్ భిన్నమైనవి. ఎందుకంటే అవి సెక్యూరిటీలుగాగానీ లేదా కమోడిటీ డెరివేటివ్‌లుగాగానీ నమోదు కాలేదు. మా పరిధిని దాటి అవన్నీ పనిచేస్తూ ఉంటాయి. ఒకవేళ రేపటి రోజున అవి మూతబడితే మదుపరులు నష్టపోయినట్టే. సెబీ మదుపరి రక్షణ వ్యవస్థ కింద మీరు ఉండరు కాబట్టి చట్టరీత్యా మేమూ ఏమీ చేయలేని పరిస్థితి. కనుక మదుపరులు ఈ రకమైన పెట్టుబడుల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి' అని సెబీ గత వారం ఓ సర్క్యులర్‌లో స్పష్టం చేసింది.ఇదీ సంగతి..గోల్డ్, గోల్డ్ సంబంధిత సాధనాల్లో పెట్టుబడులు పెట్టాలనుకునే మదుపరులు సెబీ రెగ్యులేటెడ్ గోల్డ్ ప్రొడక్ట్స్‌ను పరిశీలించవచ్చు. మల్టీ కమోడిటీ ఎక్స్చేంజ్‌పై ట్రేడయ్యే ఎక్స్చేంజ్-ట్రేడెడ్ కమోడిటీ డెరివేటివ్ కాంట్రాక్టులు, మ్యూచువల్ ఫండ్స్ ఆఫర్ చేసే గోల్డ్ ఎక్స్చేంజ్-ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్‌లు), స్టాక్ ఎక్స్చేంజీల్లో ట్రేడయ్యే ఎలక్ట్రానిక్ గోల్డ్ రిసిప్ట్స్ (ఈజీఆర్‌లు) వంటివి అందుబాటులో ఉన్నాయని సెబీ చెప్తున్నది. అలాగే సెబీ రెగ్యులేటెడ్ ఇంటర్మీడియరీల ద్వారానే ఈ పెట్టుబడులకు వెళ్లాలని, అప్పుడే తమ విధివిధానాలకు లోబడి మదుపరుల పెట్టుబడులు రక్షణాత్మకంగా ఉంటాయని సూచిస్తున్నది.రూ.1,300 పెరిగిన బంగారం ధరబంగారం ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. సోమవారం ఒక్కరోజే ఢిల్లీలో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాములు రూ.1,300 పుంజుకొని రేటు రూ.1,25,300ను తాకింది. కిలో వెండి విలువ కూడా రూ.2,460 ఎగసి రూ.1,55,760కి ఎగబాకింది. ఇక హైదరాబాద్‌లో 24 క్యారెట్ తులం రూ.1,800 పెరిగి రూ.1,23,820గా నమోదైంది. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) రూ.1,650 అందుకొని రూ.1,13,500కు చేరుకున్నది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ గోల్డ్ 83.12 డాలర్లు ఎగసి 4 వేల డాలర్ల మార్కుకు ఎగువన 4,082.84 డాలర్ల వద్ద ముగిసింది. అలాగే సిల్వర్ 49.93 డాలర్లకు పెరిగింది. కాగా, అమెరికా స్థూల ఆర్థిక గణాంకాలు బలహీనంగా ఉండటంతో మదుపరులు తమ పెట్టుబడుల రక్షణార్థం పసిడి వైపునకు కదులుతుండటమే ధరల పెరుగుదలకు కారణమని ట్రేడర్లు మార్కెట్ సరళిని విశ్లేషిస్తున్నారు.మరి నిపుణులు ఏం చెప్తున్నారుసెబీ నియంత్రిత ప్రొడక్ట్స్‌లో మీ డిజిటల్ గోల్డ్ పెట్టుబడులు లేకపోతే వాటిని తక్షణమే ఉపసంహరించుకోండి. దీనివల్ల మదుపరులకు కొంతమేర నష్టం వాటిల్లవచ్చు. అయితే 100 శాతం నష్టపోయే ప్రమాదం నుంచి మాత్రం తప్పించుకుంటారు. ఆకర్షణీయ యాప్‌ల మాయలోపడి, విశ్వసనీయతను గాలికి వదిలేయవద్దు. గోల్డ్ ఈటీఎఫ్‌లు, ఈ-గోల్డ్ రిసిప్ట్‌లు సెబీ రెగ్యులేటెడ్ ప్రొడక్ట్స్. వీటిలో పెట్టుబడులు సురక్షితం. చట్టపరమైన రక్షణ కూడా ఉంటుంది.%-% అభిషేక్ కుమార్, సెబీ నమోదిత సలహాదారుఫిన్‌టెక్ యాప్స్, వ్యాలెట్లు లేక సెబీ నియంత్రణలో లేని ఇతర వేదికల ద్వారా డిజిటల్ గోల్డ్/ఈ-గోల్డ్‌ను కొన్నవారు లేదా కలిగి ఉన్నవారు ఇకపై జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉన్నది. మీ పెట్టుబడులపై రాబడులను అందుకోవడానికి, భౌతిక బంగారంగా మార్చుకోవడానికి ఇబ్బందులు తలెత్తే వీలున్నది. అయినప్పటికీ పెట్టుబడులను రేపే వెనక్కి తీసుకోవాలన్న భయాలేమీ అక్కర్లేదు. అయితే మీరు పెట్టుబడులు పెట్టిన యాప్/సంస్థల వాల్టింగ్, బ్యాకింగ్, రిడెంప్షన్ నిబంధనలు, ఫీజులు, లిక్విడిటీల గురించి ఆరా తీయడం ఉత్తమం.-% అమర్ రను, ఆనంద్ రాఠీ షేర్స్ అండ్ స్టాక్ బ్రోకర్స్ఇటీవలి కాలంలో డిజిటల్ గోల్డ్‌పై పెట్టుబడులు పెద్ద ఎత్తున పెరుగుతున్నాయి. ముఖ్యంగా యువ మదుపరులు వీటిపట్ల అమితాసక్తిని కనబరుస్తున్నారు. నిజానికి సెబీ తాజా హెచ్చరికలు ఈ పెట్టుబడులను నిరుత్సాహపర్చడానికేమీ కాదు. అయినప్పటికీ మదుపరులు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరాన్ని గుర్తుచేసింది. కనుక విశ్వసనీయమైన, పారదర్శకమైన వేదికల్లోనే పెట్టుబడులు పెట్టండి. ఇప్పటికిప్పుడు డిజిటల్ గోల్డ్ మదుపరులు భయపడాల్సిన అవసరమేమీ లేదు. పెట్టుబడుల ఉపసంహరణల గురించి ఆలోచించకండి. అయితే మీ పెట్టుబడుల స్వరూపం ఎలా ఉన్నది? భద్రంగా నిల్వ చేస్తున్నారా అనేది తెలుసుకోండి.%-% సువంకర్ సేన్, సెంకో సీఈవోడిజిటల్ గోల్డ్‌లో పెట్టుబడులు పెట్టేముందు అన్ని కోణాల్లో క్షుణ్ణంగా పరిశీలించండి. డిజిటల్ గోల్డ్ అనేది సెబీ పరిధిలోకి రాని అంశం. కాబట్టి స్పష్టమైన విధివిధానాలేమీ ఉండవు. కనుక మదుపరులకు నష్టాలు వాటిల్లే ప్రమాదం ఉన్నది. మీ కష్టార్జితాన్ని సురక్షిత పెట్టుబడి సాధనాల్లో పెట్టడమే మంచిది.

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు.. 319 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్..




దేశీయ స్టాక్ మార్కెట్లు వారంలో తొలిరోజు లాభాల్లో ముగిశాయి. ప్రపంచ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాల మధ్య మార్కెట్లు ఫ్లాట్‌గా మొదలయ్యాయి. అత్యధికంగా హెచ్‌సీఎల్, బజాజ్ ఫైనాన్స్ భారీ లాభాలను నమోదు చేశాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 83,198.20 పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమైంది. దేశీయ స్టాక్ మార్కెట్లు వారంలో తొలిరోజు లాభాల్లో ముగిశాయి. ప్రపంచ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాల మధ్య మార్కెట్లు ఫ్లాట్‌గా మొదలయ్యాయి. అత్యధికంగా హెచ్‌సీఎల్, బజాజ్ ఫైనాన్స్ భారీ లాభాలను నమోదు చేశాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 83,198.20 పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమైంది. ఆ తర్వాత మార్కెట్లు కోలుకొని లాభాల్లోకి దూసుకెళ్లాయి. ఇంట్రాడేలో 83,197.67 పాయింట్ల కనిష్టాన్ని తాకిన సెన్సెక్స్.. గరిష్టంగా 83,754.49 పాయింట్లు పెరిగింది. చివరకు 319.07 పాయింట్లు పెరిగి 83,535.35 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 82.05 పాయింట్ల లాభంతో 25,574.35 వద్ద స్థిరపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 6 పైసలు తగ్గి 88.71 వద్ద ముగిసింది. దాదాపు 1,787 షేర్లు పుంజుకోగా.. 2,183 షేర్లు పతనమయ్యాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.6 శాతం పెరగ్గా, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.4 శాతం తగ్గింది. మీడియా మినహా, మిగతా అన్ని రంగాల సూచీలు లాభాల్లో ముగిశాయి. ఐటీ ఇండెక్స్ 1.6 శాతం, ఫార్మా ఇండెక్స్ దాదాపు 1 శాతం, మెటల్ ఇండెక్స్ 0.6శాతంపెరిగాయి.నిఫ్టీలో ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, బజాజ్ ఫైనాన్స్, విప్రో లాభాలనుఆర్జించగా..ట్రెంట్, అపోలో హాస్పిటల్స్, మ్యాక్స్ హెల్త్‌కేర్, పవర్ గ్రిడ్, టాటా కన్స్యూమర్ నష్టపోయాయి.యూఎస్‌సెనేట్ షట‌డౌన్‌ను ముగించాలని నిర్ణయించిన తర్వాతసోమవారంయూరప్, ఆసియామార్కెట్లులాభపడ్డాయి. ఆది వారంఆలస్యంగా జరిగిన ఓటింగ్‌లో ఫెడరల్ ప్రభుత్వానికి నిధులు సమకూర్చడానికి రాజీ బిల్లును ఆమోదించేప్రక్రియనుసెనేట్ ప్రారంభించింది. అయితే, డెమొక్రాట్లు అభ్యంతరం వ్యక్తం చేసి ప్రక్రియను ఆలస్యం చేస్తే తుది ఆమోదం చాలా రోజులు పట్టే అవకాశం ఉంది. డిసెంబర్ మధ్య నాటికి గడువు ముగిసే ఆరోగ్య సంరక్షణ పన్ను క్రెడిట్‌ను పొడిగించడంపై సెనేట్ ఓటు వేసే అవకాశం ఉంది. సుదీర్ఘంగా కొనసాగుతున్న షట్‌డౌన్ ముగిసిపోతుందన్న అంచనాల మధ్య ఎస్అండ్‌పీ500 అంచనాను 0.7 శాతం పెంచాయి. డౌ జోన్స్ ఇండస్ట్రియల్ యావరేజ్ అంచనా 0.1 శాతం పెరిగింది. జర్మనీ డాక్స్ 1.4 శాతం పెరిగి 23,891.71 చేరగా.. పారిస్ సీఏసీ 40 0.9 శాతం పెరిగి 8,024.23.. బ్రిటన్ ఎఫ్‌టీఎస్‌ఈ-100 0.5 శాతం పెరిగి 9,729.77కి చేరుకుంది

# గూగుల్ ప్లేలోకి 'రియల్ మనీ గేమ్స్'- సీసీఐ ఎదుట గూగుల్ కీలక ప్రతిపాదనలు




'రియల్ మనీ గేమ్స్'పై సీసీఐ ఎదుట గూగుల్ కీలక ప్రతిపాదనలు- గూగుల్ ప్లేలోకి వాటిని అనుమతిస్తామని వెల్లడి- నైపుణ్య ఆధారిత గేమ్స్‌పై యాడ్స్‌ను ప్రదర్శించేందుకూ రెడీ!భారతీయ గేమింగ్ కంపెనీ 'విన్‌జో గేమ్స్ ప్రైవేట్ లిమిటెడ్' ఫిర్యాదు ఆధారంగా గూగుల్‌పై కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) నిర్వహిస్తున్న దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. గూగుల్ ప్లేలో రియల్ మనీ గేమ్ (ఆర్‌ఎంజీ- %=వీ+%) యాప్స్‌ను అనుమతించేందుకు సిద్ధమని సీసీఐ ఎదుట గూగుల్ ప్రతిపాదించింది. గూగుల్ యాడ్స్ పాలసీలో మార్పులు చేసి, నైపుణ్య ఆధారిత గేమ్స్‌పై భారత్‌లో యాడ్స్‌ను అనుమతించేందుకు కూడా తాము సిద్ధమని తెలిపింది. అయితే ఇందుకు కొన్ని షరతులు వర్తిస్తాయని పేర్కొంది. ప్రభుత్వ నియంత్రణ సంస్థల ప్రమాణాలను పాటిస్తున్నట్లుగా తెలిపే థర్డ్ పార్టీ ధ్రువీకరణను అందించే నైపుణ్య ఆధారిత గేమ్ యాప్స్‌కు చెందిన యాడ్స్‌ను అనుమతిస్తామని గూగుల్ వెల్లడించింది.ఏ ఒక్క యాప్‌కూ అన్యాయం జరగకుండా చూస్తాంతమ పాలసీకిఅనుగుణంగానడుచుకు నేం దుకు సిద్ధమయ్యే అన్ని రియల్ మనీ గేమ్‌యాప్స్‌కుఎలాంటి తారతమ్యాలు లేకుండా గూగుల్ ప్లే, గూగుల్ యాడ్స్‌లోచోటు కల్పిస్తామని సీసీఐకు గూగుల్ చెప్పింది. మార్కెట్‌లో పోటీ పడే విషయంలో ఏ ఒక్క రియల్ మనీగేమ్‌యాప్‌కుఅన్యాయంజరగక ుండా చూస్తామని, ఈ కేటగిరీకి చెందిన అన్ని యాప్‌లకు సరిసమాన అవకాశాలు కల్పించే దిశగా నిర్దిష్ట ప్రమాణాలను అమలుపరుస్తామని స్పష్టం చేసింది. ఏ ఒక్క వినియోగదారుడి పక్షానో, మర్చంట్ పక్షానో, ప్రొడక్ట్ పక్షానో (ఆర్‌ఎంజీ యాప్స్, నాన్ ఆర్‌ఎంజీ యాప్స్), డెవలపర్ పక్షానో తాము నిలువమని సీసీఐకు గూగుల్ తెలిపింది. అందరికీ ఒకేవిధమైన పారదర్శక నిబంధనలను వర్తింపజేస్తామని, గూగుల్ ప్లే వేదికగా జరిగే అన్ని చెల్లింపులకు ఒకే విధమైన ప్రమాణాలు అమలవుతాయని వెల్లడించింది.పైలట్ ప్రోగ్రాంను రీప్లేస్ చేసేందుకు సిద్ధం'గూగుల్ ప్లే' పైలట్ ప్రోగ్రాంలో డైలీ ఫ్యాంటసీ స్పోర్ట్స్ రమ్మీకి చెందిన యాప్స్‌ను మాత్రమే చేర్చడం, వాటికి కలిసొస్తుండగా కొత్తగా మార్కెట్‌లోకి వస్తున్న యాప్స్‌కు అవరోధంగా మారుతోందని ఇటీవలే సీసీఐ పేర్కొంది. దీనిపై గూగుల్ స్పందిస్తూ , 'గూగుల్ ప్లే' పైలట్ ప్రోగ్రాంను రీప్లేస్ చేసేందుకు తాము సిద్ధమని తెలిపింది. భారతదేశ చట్టాల ప్రకారం నడుచుకుంటామని సెల్ఫ్ డిక్లరేషన్‌ను అందించే డెవలపర్లకు చెందిన అన్ని రియల్ మనీ గేమ్ యాప్స్‌ను గూగుల్ ప్లేలో డిస్ట్రిబ్యూట్ చేస్తామని వెల్లడించింది. రియల్ మనీ గేమ్ యాప్స్‌ను తయారు చేసే డెవలపర్లకు సంబంధించి అనుసరించాల్సిన సముచిత వాణిజ్య విధానాలను ఖరారు చేసుకోవడంపై తమ కసరత్తు తుదిదశకు చేరిందని గూగుల్ తెలిపింది.ఆగస్టు 20 వరకు ప్రజాభిప్రాయ సేకరణరియల్ మనీ గేమ్ యాప్స్‌లో జనరేట్ అయ్యే 'చెల్లింపు (పేమెంట్) హెచ్చరికలు' అనేవి డెవలపర్ తరఫు ప్రోగ్రామింగ్‌కు సంబంధించినవని గూగుల్ తేల్చి చెప్పింది. అయితే ఇవి వినియోగదారుల భద్రతకు భంగం కలిగించకుండా, అత్యంత పారదర్శకంగా ఉండాలని స్పష్టం చేసింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ), నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) నిర్దేశించిన వినియోగదారుల భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా 'చెల్లింపు (పేమెంట్) హెచ్చరికలు' ఉండాలని తెలిపింది. గూగుల్ చేసిన ఈ ప్రతిపాదనలపై ఆగస్టు 20లోగా ప్రజలు అభిప్రాయాలను తెలియజేయొచ్చని కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పేర్కొంది.గూగుల్ ప్రతిపాదనలపై విన్‌జో స్పందన ఇదీగూగుల్‌పై సీసీఐకు ఫిర్యాదు చేసిన విన్‌జో కంపెనీ తాజాగా శుక్రవారం రోజు కీలక ప్రకటన చేసింది. సీసీఐ ఎదుట పలు ప్రతిపాదనలను ఉంచడం ద్వారా ఈ వివాదాన్ని పరిష్కరించుకోవాలని గూగుల్ భావిస్తోందని అభిప్రాయపడింది. గూగుల్ ప్లేలో యాప్స్‌ను డిస్ట్రిబ్యూట్ చేసే విషయంలో వివక్షకు తావు లేకుండా చూస్తే చాలు అని విన్‌జో కంపెనీ పేర్కొంది. గూగుల్ ప్రతిపాదనలను నిశితంగా పరిశీలించి, సీసీఐ ఎదుట తమ తదుపరి వాదనలను ఉంచుతామని వెల్లడించింది. రియల్ మనీ గేమింగ్ యాప్స్ కోసం వాణిజ్య నమూనాకు రూపకల్పన చేస్తున్నామని గూగుల్ చెబుతోందని, అయితే ఎప్పటిలోగా దాన్ని తీసుకొస్తారు పనితీరు ఎలా ఉంటుంది? లక్ష్యాలు ఏమిటి అనే అంశాలపై క్లారిటీ ఇవ్వలేదని విన్‌జో తెలిపింది. ఆ వాణిజ్య నమూనా ఏమిటో వేచి చూడాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించింది.

## ఇక బహ్రెయిన్‌లోనూ యూపీఐ సేవలు.. త్వరలోనే అందుబాటులోకి..!



ారత్-బహ్రెయిన్ మధ్య రియల్ టైమ్ క్రాస్ బోర్డర్ లావాదేవీలను సులభతరం చేయడానికి ఆ దేశానికి చెందిన ప్రముఖ ఫిన్‌టెక్ కంపెనీ వెనెఫిట్‌తో భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నట్లుగా నేషనల్ పేమెంట్ లిమిటెడ్‌సోమవారం ప్రకటించింది. దాంతో యూనిఫైడ్ పేమెంట్స్ఇంటర్‌ఫేస్ సేవలు బహ్రెయిన్ ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ సిస్టమ్‌తో ముఖ్యంగా ఫారిప్లస్ సేవతో అనుసంధానించనున్నట్లు తెలిపింది. భారత్-బహ్రెయిన్ మధ్య రియల్ టైమ్ క్రాస్ బోర్డర్ లావాదేవీలను సులభతరం చేయడానికి ఆ దేశానికి చెందిన ప్రముఖ ఫిన్‌టెక్ కంపెనీ వెనెఫిట్‌తో భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నట్లుగా నేషనల్ పేమెంట్ లిమిటెడమవారం ప్రకటించింది. దాంతో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేససేవలు బహ్రెయిన్ ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ సిస్టమ్ (%జుఖీూ%)తో ముఖ్యంగా ఫారిప్లస్ సేవతో అనుసంధానించనున్నట్లు తెలిపింది. ఇది రెండు దేశాల్లోని వినియోగదారులు తక్షణం డబ్బు పంపించడంతో పాటు స్వీకరించడం వీలవుతుంది. ఫారీప్లస్ అనేది బహ్రెయిన్‌లో దాదాపు రియల్ టైమ్ బ్యాంక్ టు బ్యాంక్ ఫండ్ ట్రాన్స్‌ఫర్ సేవలు అందిస్తుంది. ఇది దేశంలోని భారతదేశం, బహ్రెయిన్ మధ్య వ్యూహాత్మక చెల్లింపుల కారిడార్‌ను ఏర్పాటు చేస్తుందని.. ఇది దేశ మొత్తం జనాభాలో దాదాపు 30 శాతం ఉన్న బహ్రెయిన్‌లో నివసిస్తున్న భారతీయులకు డబ్బు పంపడం, స్వీకరించడాన్ని సులభతరం, సురక్షితంగా చేస్తుందని పేర్కొన్నారు.

# ఓటీటీలో
# రూ.100 కోట్ల సినిమా.. ఈ వారంలోనే డ్యూడ్ స్ట్రీమింగ్



దీపావళికి రిలీజైన అన్ని సినిమాలు ఓటీటీ డేట్ ఇచ్చేశాయి. కిరణ్ అబ్బవరం 'కె-ర్యాంప్' నవంబర్ 15న ఆహాలో రిలీజ్ అవుతున్నట్లు ప్రకటించారు. సిద్దు జొన్నలగడ్డ 'తెలుసు కదా' మూవీ నవంబర్ 14న నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలవుతున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఇక దీపావళి రేసులో బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'డ్యూడ్' సినిమా ఓటీటీ డేట్ మాత్రం అనౌన్స్ చేయకుండా అభిమానులను సస్పెన్స్‌లో ఉంచారు. ఈ వారమే ఓటీటీలో ఈ సస్పెన్స్‌కు తెర దించుతూ ఎట్టకేలకు డ్యూడ్ ఓటీటీ రిలీజ్ డేట్ ప్రకటించారు. నవంబర్ 14న నెట్‌ఫ్లిక్స్‌లో రానుందంటూ ఎక్స్ వేదికగా పోస్టర్ రిలీజ్ చేశారు. తెలుగుతో పాటు తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో డ్యూడ్ అందుబాటులోకి రానుందని వెల్లడించారు. డ్యూడ్ విషయానికి వస్తే.. ప్రదీప్ రంగనాథన్, మమితా బైజు ప్రధాన పాత్రలు పోషించారు. శరత్‌కుమార్ కీలక పాత్రలో నటించగా కీర్తి శ్వరన్ దర్శకుడిగా పరిచయమయ్యాడు. మైత్రీమూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించారు. ఈ సినిమా అక్టోబర్ 17న తెలుగు, తమిళ భాషల్లో విడుదల కాగా ఈజీగా రూ.100 కోట్లు రాబట్టింది. డ్యూడ్ కథేంటంటే.. గగన్ (ప్రదీప్ రంగనాథన్).. ఆముద (నేహా శెట్టి)ని ప్రేమిస్తాడు. కానీ మరొకరిని పెళ్లి చేసుకుంటుంది. గగన్‌ను అతడి మేనమామ (శరత్ కుమార్) కూతురు కుందన (మమిత బైజు) ప్రేమిస్తుంది. కానీ, ఆమె పెళ్లి ప్రపోజల్‌ను గగన్ రిజెక్ట్ చేస్తాడు. కొంతకాలానికి ఆమెనే పెళ్లాడాలనుకున్న టైమ్‌కు కుందన పార్థు (హృదయ్)తో ప్రేమలో ఉంటుంది. అయినప్పటికీ గగన్-కుందనకే పెళ్లి జరుగుతుంది. వీళ్ల పెళ్లికి కారణమేంటి? తర్వాత కలిసున్నారా? లేదా? అనేది ఓటీటీలో చూసేయండి..



## రవితేజ కొత్త మూవీ సంక్రాంతికి రిలీజ్

గత కొన్నేళ్లుగా హీరో రవితేజ సినిమాలైతే చేస్తున్నాడు గానీ హిట్ అనేది లేకుండా పోయింది. వారం పదిరోజుల క్రితం 'మాస్ జాతర' అంటూ వచ్చాడు. యధావిధిగా ఇది కూడా ఫ్లాప్ అయింది. ఇప్పుడు మరో కొత్త మూవీని సిద్ధం చేశాడు. దీనికి 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అనే టైటిల్ ఫిక్స్ చేయడంతో పాటు గ్లింప్స్ కూడా రిలీజ్ చేశారు. నేను శైలజ, ఉన్నది ఒకటే జిందగీ లాంటి సినిమాలతో ఆకట్టుకున్న కిశోర్ తిరుమల.. రవితేజ కొత్త చిత్రానికి దర్శకుడు. గ్లింప్స్ చూస్తుంటే కామెడీగా బాగానే ఉంది. రామసత్యనారాయణ (రవితేజ)ని అతడి జీవితంలోని ఇద్దరు ఆడోళ్లు రెండు ప్రశ్నలు అడుగుతారు. ఇంతకీ ఆ ప్రశ్నలేంటి? వాటికి ఎవరూ ఎందుకు సమాధానం చెప్పలేకపోయారనేదే స్టోరీలా అనిపిస్తుంది. 'నా జీవితంలోని ఇద్దరు ఆడవాళ్లు రెండు ప్రశ్నలు అడిగారు.. సమాధానం కోసం చాలా ప్రయత్నించారు. గూగుల్, చాట్ జీపీటీ, జెమినీ, ఏఐ.. ఇలా అన్నింటినీ అడిగారు. బహుశా వాటికి పెళ్లి కాకపోవడం వల్ల ఆన్సర్ చెప్పలేకపోయాయేమో' అని రవితేజ చెప్పిన డైలాగ్స్ ఫన్నీగా ఉన్నాయి. ఇందులో ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి హీరోయిన్లు. భీమ్స్ సంగీతమందించాడు. వచ్చే సంక్రాంతికి మూవీని థియేటర్లలో రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. గ్లింప్స్ చూస్తుంటే ఈసారి రవితేజ హిట్ కొడతాడేమో అనిపిస్తుంది.

## క్రిస్మస్‌కి థియేటర్లలోకి 'దండోరా'



కలర్ ఫోటో, బెదురులంక 2012 సినిమాలని నిర్మించిన లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ నుంచి వస్తున్న లేటెస్ట్ సినిమా 'దండోరా'. మురళీకాంత్ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం షూటింగ్ జరుగుతోంది. ఈ క్రమంలోనే విడుదల తేదీని ప్రకటించారు. క్రిస్మస్ సందర్భంగా డిసెంబరు 25న మూవీ థియేటర్లలోకి వస్తుందని నిర్మాతలు ప్రకటించారు. అగ్ర వర్ణాలకు చెందిన అమ్మాయిలు ప్రేమించి పెళ్లి చేసుకున్నా, అగ్ర వర్ణాలకు ఎదురు తిరిగినా ఎలాంటి దౌర్జన్యకాండ జరుగుతున్నాయనే అంశాన్ని ఆధారంగా చేసుకుని 'దండోరా' సినిమా తీశారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో ఆచారాలు, సాంప్రదాయాలను ఆవిష్కరిస్తూ దీన్ని తెరకెక్కించారు. శివాజీతో పాటు నవదీప్, బిందు మాధవి తదితరులు నటించారు. బిందుమాధవి ఇందులో వేశ్య పాత్రలో కనిపించనుంది.



# నవంబర్ మూడో వారం "ది రాజా సాబ్" రిలీజ్!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, దర్శకుడు మారుతి తెరకెక్కిస్తున్న హారర్-కామెడీ "ది రాజా సాబ్" చిత్రం పై అంచనాలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. ముఖ్యంగా ఈ సినిమా నుండి ఫస్ట్ సింగిల్ ఎప్పుడు వస్తుందన్న దానిపై అభిమానుల మధ్య పెద్ద చర్చ జరుగుతోంది. దీనిపై చివరికి నిర్మాత ఎస్‌కేఎన్ స్పందించి క్లారిటీ ఇచ్చారు. ఎస్‌కేఎన్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఫస్ట్ సింగిల్ విడుదలలో ఆలస్యం రావడానికి కారణం ఉత్తర భారత, తెలుగు మార్కెటింగ్ టీమ్‌ల మధ్య చర్చలు అని చెప్పారు. మొదటగా 'రెబెల్ సాబ్' అనే ఎనర్జిటిక్ సాంగ్‌ను ముందుగా విడుదల చేయాలని అనుకున్నా, ఉత్తర భారత పంపిణీదారులు మాత్రం ముందుగా మెలోడి సాంగ్ రిలీజ్ చేయాలని సూచించారని తెలిపారు. ఈ భిన్నాభిప్రాయాల వల్లే చిన్న ఆలస్యం జరిగిందని అన్నారు. దక్షిణ భారత మార్కెట్లో సాధారణంగా లిరికల్ వీడియోలు మాత్రమే రిలీజ్ చేసి, పూర్తి సాంగ్ వీడియోలను థియేటర్స్‌లో చూపిస్తారని, కానీ ఉత్తర భారత మార్కెట్లో మాత్రం పూర్తి వీడియో సాంగ్స్ ముందుగానే విడుదల చేస్తారని ఎస్‌కేఎన్ వివరించారు. ఇందుకే ఆలస్యం జరిగుతుందని తెలియజేశారు. "ది రాజా సాబ్"లో ఐటెమ్ సాంగ్ ఉండదని, అయితే ఒక పాపులర్ హిందీ సాంగ్‌ను రీమిక్స్ వెర్షన్‌గా తీస్తున్నామని నిర్మాత తెలిపారు. ప్రతి సాంగ్ రిలీజ్ మధ్య 10%–%14 రోజుల గ్యాప్ ఇస్తారని, ఇలా చేయడం వల్ల ప్రేక్షకులు ప్రతి సాంగ్‌ను మంచి మ్యూజిక్ అనుభవంతో ఆస్వాదించగలరని చెప్పారు. ఎస్‌కేఎన్ ప్రకారం, ఫస్ట్ సింగిల్ నవంబర్ మూడో లేదా నాలుగో వారంలో విడుదల కానుంది. ఆ తర్వాత సినిమా ప్రమోషన్లు డిసెంబర్ చివరి వరకు కొనసాగుతాయి. ఈ క్రమంలో "ది రాజా సాబ్" ను 2026 జనవరి 9న, సంక్రాంతి సీజన్‌లో గ్రాండ్‌గా రిలీజ్ చేయడానికి టీమ్ సన్నాహాలు చేస్తోంది. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నారు. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. మొత్తానికి, "ది రాజా సాబ్" ఫస్ట్ సింగిల్‌పై ఉన్న ఆసక్తి మరింత పెరిగింది. నిర్మాత ఎస్‌కేఎన్ ఇచ్చిన తాజా అప్‌డేట్‌తో అభిమానులు ఊరట చెందారు. మెలోడి సాంగ్ రూపంలో రాబోయే ఈ ఫస్ట్ సింగిల్, ప్రభాస్ మ్యూజిక్ జర్నీకి కొత్త ఛాప్టర్‌గా నిలిచే అవకాశముంది.



# రొమాంటిక్‌గా శర్వానంద్ బైకర్ లుక్.. లాంచ్ టైం ఫిక్స్

అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో టాలీవుడ్ యువ హీరో శర్వానంద్ నటిస్తున్న చిత్రం బైకర్  శర్వా36 ప్రాజెక్టుగా వహిస్తున్న ఈ చిత్రంలో మాళవికా నాయర్ హీరోయిన్‌గా నటిస్తోంది. మీరు బైకర్ స్పీడ్ ఎలా ఉందో చూశారు. ఇక ఇప్పుడు ప్రెప్పీ మెలోడీ టైం వచ్చేసిందంటూ.. ఫస్ట్ సింగిల్ ప్రోమో అప్‌డేట్ లుక్ విడుదల చేశారు. హెల్మెట్ పెట్టుకున్న హీరోయిన్‌తో రొమాంటిక్ మూడ్‌లో ఉన్న శర్వానంద్ స్టిల్ సాంగ్‌పై క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ పాట ప్రోమోను నవంబర్ 11న లాంచ్ చేయనున్నట్టు ప్రకటించారు. గిబ్రాన్ మ్యాజికల్ ఆల్బమ్‌ను రెడీ చేస్తున్నట్టు తాజా లుక్ చెప్పకనే చెబుతోంది. ఇప్పటికే విడుదల చేసిన గ్లింప్స్.. ఇక్కడ ప్రతీ బైకర్‌కు ఓ కథ ఉంటుంది. సమయంతో పోరాడే కథ.. చావుకు ఎదురెళ్లే కథ.. అంటూ సాగే వాయిస్‌తో ఓవర్‌తో మొదలైన గ్లింప్స్ బైక్ రేసుతో సాగుతుంది. ఏం జరిగినా పట్టువదలని మొండోళ్ల కథ అంటూ బైక్ రేసింగ్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో సినిమా ఉండబోతున్నట్టు హింట్ ఇచ్చేస్తుంది. మీ హెల్మెట్లను పట్టుకోండి.. రైడ్ వైల్డ్‌గా ఉండబోతుంది.. గూస్‌బంప్స్ తెప్పించే అడ్వెంచరస్ రైడ్‌కు సిద్ధంగా ఉండండి.. అంటూ శర్వానంద్ టీం ఇప్పటికే బైకర్ సినిమాపై అంచనాలు భారీగా పెంచేస్తుంది. ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ బ్యానర్‌లో వంశీ కృష్ణారెడ్డి, ఉప్పలపాటి ప్రమోద్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. బైకర్‌లో డాక్టర్ రాజశేఖర్ శర్వానంద్ తండ్రి పాత్రలో కనిపించనుండగా బ్రహ్మాజి, అతుల్ కులకర్ణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి గిబ్రాన్ సంగీతం అందిస్తున్నాడు.

Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad "office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332